నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ శనివారం 6-2-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 160 పేజీలు: 4 వెల: రూ.1/-

రైతుల ఆందోళనలు ఒక్క రాష్ట్రానికే పరిమితం

రైతులను కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారు
మేలు చేసే చట్టాలు నల్ల చట్టాలు ఎలా అయ్యాయో తెలపండి
రాజ్యసభలో కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): కొత్త సాగు చట్టాలకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు కేవలం ఒక రాష్ట్రానికే పరిమితమని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ చెప్పారు. ఈ చట్టాల్లో ఎటువంటి సమస్యలు లేవని చెప్పూ, రైతులను కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు.

నరేంద్ర సింగ్ తోమర్ శుక్రవారం రాజ్యసభలో మాట్లాడుతూ, ప్రతిపక్షాలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు కొత్త సాగు చట్టాలపై చర్చిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ చట్టాలను నల్ల చట్టాలు అని అభివర్ణించినందుకు మండిపడ్డారు. ఈ చట్టాలు నల్ల చట్టాలు ఎలా అయ్యాయో చెప్పాలని రైతు సంఘాలను తాను కోరుతున్నానన్నారు. కానీ ఎవరూ తనకు వివరంగా చెప్పలేదన్నారు. ఈ చట్టాలు అమల్లోకి వస్తే రైతుల భూములను ఇతరులు ఆక్రమించుకుంటారని రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్ట్ ఫార్మింగ్ చట్టంలోని నిబంధనల్లో కనీసం ఒక నిబంధన అయినా రైతుల భూమిని వ్యాపారులు లాక్కొనేందుకు అవకాశం కల్పిస్తోందా? అలాంటి నిబంధన ఈ చట్టంలో ఉంటే చూపించండి? అని నిలదీశారు. రైతులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని, జీడీపీలో వ్యవసాయ రంగం వాటా వేగంగా పెరగాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టు కుందన్నారు. ఉత్పాదక వ్యయం కన్నా 50 శాతం ఎక్కువగా ఎంఎస్‌పీని ఇవ్వడం ప్రారంభించామని అన్నారు. స్వయం సమృద్ధ భారత్ పథకం క్రింద వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని రూ.1 లక్ష కోట్లతో ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయ రంగానికి అవసరమైన పెట్టుబడులను సమకూర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కృషిలో చాలా ముఖ్యమైన చర్య కొత్త సాగు చట్టాలని తెలిపారు.ఇకపోతే కొవిడ్-19 మహమ్మారి దేశంలో వ్యాప్తి చెందిన సమయంలో కేంద్ర ప్రభుత్వం సరేగా కేటాయింపులను రూ. 61,000 కోట్ల నుంచి రూ. 1.15 లక్షల కోట్లకు పెంచిందని, పది కోట్ల మందికి పైగా ఉపాధిని సమకూర్చిందని కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ పేర్కొన్నారు. వ్యవసాయ చట్టాల గురించి ఒక రాష్ట్రంలో దుష్ప్రచారం జరిగిందని అన్నారు. వ్యవసాయ చట్టాల్లో సవరణలకు ప్రభుత్వం ముందుకు వచ్చినంత మాత్రాన ఆ చట్టాలు లోపభూయిష్టమైనవి కాదని పేర్కొన్నారు. ఈ చట్టాలు అమలైతే ఇతరులు మీ భూములను ఆక్రమించు కుంటారని రైతులను కొందరు తప్పుదారి పట్టిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఉత్పత్తి వ్యయం కంటే 50 శాతం అదనంగా మద్దతుధరను ప్రభుత్వం ప్రకటిస్తోందని, ఆత్మనిర్భర్ ప్యాకేజ్ కింద రూ లక్ష కోట్లతో వ్యవసాయ మౌలిక నిధిని ఏర్పాటు చేశామని మంత్రి చెప్పారు.

అలనాటి నటుడు కాంతారావు సతీమణి కన్నుమూత

హైదరాబాద్,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): దివంగత నటుడు కాంతారావు సతీమణి హైమావతి(87) కన్నుమూశారు. మల్లాపూర్‌లోని నివాసంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. 2009లో మార్చి 22న కాంతారావు మరణించిన విషయం తెలిసిందే. కాంతారావు, హైమావతి దంపతులకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె మృతిపట్ల తెలుగు సినీ పరిశ్రమ, రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

7న టిఆర్ఎస్ కార్యవర్గ భేటీ

మంత్రులు,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలకు ఆహ్వానం

హైదరాబాద్,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): ఈ నెల 7న ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అధ్యక్షతన టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి రాష్ట్ర కమిటీ సభ్యులతో పాటు రాష్ట్ర మంత్రులు, లోకసభ సభ్యులు, రాజ్యసభ సభ్యులు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్ పర్సన్లు, జడ్పీ చైర్ పర్సన్లు, మున్సిపల్ మేయర్లు, డీసీసీబీ అధ్యక్షులు, డీసీఎంఎస్ అధ్యక్షులను ఆహ్వానించారు.

పార్టీ సభ్యత్వాల పునరుద్ధరణ, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కమిటీల నియామకం, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి ఎన్నిక, ఏప్రిల్ 27న పార్టీ వార్షిక మహాసభ, ఇతర సంస్థాగత అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నారు.

థియేటర్లలో వంద శాతం ఆక్యుపెన్సీ

ఉత్తర్వులు ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని థియేటర్లలో వందశాతం సీట్లకు అనుమతిని ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. సిమాహాళ్లలో సీట్లు ఫుల్ చేసుకోవడానికి అనుమతులిచ్చింది. దాంతో ఇప్పటివరకు ఉన్న 50 శాతం? ఆక్యుపెన్సీ 100 శాతంనికి పెంచుకోవడానికి మార్గం సుగమం అయింది. మల్టీప్లెక్స్‌లు, సినిమా హాళ్లలో 100 శాతం ఆక్యుపెన్సీకి అనుమతిస్తూ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ జనవరి 29న ప్రకటన విడుదల చేసింది. దాంతో తెలంగాణలో కూడా 100 శాతం సీట్లు ఫుల్ చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. దానికి సంబంధించి జీఓను కూడా విడుదల చేసింది. కరోనా వైరస్ కారణంగా దాదాపు ఏడు నెలలుగా మూతపడిన సినిమా థియేటర్లకు ఇది కొంత ఉపశమనాన్ని కలిగించిందనే చెప్పుకోవచ్చు. లాక్‌డౌన్ తర్వాత థియేటర్లు తిరిగి ప్రారంభమైనప్పటికీ.. ప్రేక్షకులు మాత్రం కరోనాకు భయపడి థియేటర్లకు దూరంగా ఉంటున్నారు. సినిమా హాళ్ళలో 100 శాతం సీటింగ్‌కు అనుమతించడంతో అటు థియేటర్ యాజమాన్యాలు, ఇటు ప్రేక్షకులు అనుసరించాల్సిన ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలను కేంద్ర మంత్రిత్వ శాఖ జారీ చేసింది. సిబ్బంది,ప్రేక్షకులందరూ కనీసం ఆరు అడుగుల భౌతిక దూరం పాటిస్తూ.. ఫేస్ మాస్క్‌లను ఉపయోగించాలని తెలిపింది. అదేవిధంగా థియేటర్ సిబ్బంది ,ప్రేక్షకులు వారివారి ఫోన్లలో ఆరోగ్య సేతు యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని తెలిపింది.

సినిమా ఇంటర్‌వెల్ సమయంలో కెఫెటేరియా, లాబీలు , వాష్‌రూమ్‌లలో రద్దీని నివారించడానికి చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి సూచించింది. బ్రేక్ సమయంలో అందరూ ఒకేసారి బయటకు వెళ్లకుండా.. కొంతమందిని ఒకసారి, మరికొంతమందిని ఇంకోసారి బయటకు పంపడానికి ప్రయత్నించాలని చెప్పింది. ఇందుకోసం అవసరమైతే బ్రేక్ సమయాన్ని పెంచుకోవచ్చని కూడా తెలిపింది. మల్టీప్లెక్స్‌లలో రద్దీని తగ్గించడానికి షో టైమింగ్స్ మార్చుకోవచ్చని తెలిపింది. ప్రతి షో తర్వాత సినిమా థియేటర్లను శుభ్రపరచాలని యాజమాన్యాన్ని ఆదేశించింది. అదేవిధంగా థియేటర్‌లోని అన్ని ఎయిర్ కండిషన్ల టెంపరేచర్ 24-30 ÷బిఅ ఉండేలా చూడాలని తెలిపింది.

శివారు కాలనీల్లోనూ అభివృద్ధి : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 5 : మహబూబ్‌నగర్ పట్టణంతోపాటు శివారు కాలనీలన్నింటిని అభివృద్ధి చేస్తామని ఎక్సైజ్, క్రీడలు, సాంస్కృతిక ,పర్యాటక శాఖ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని అయోధ్య నగర్‌లో రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

పాత పాలమూరులో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మినీ ఫంక్షన్ హాల్‌కు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ప్రజల అవసరాలను గుర్తించి వారి సౌకర్యాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామన్నారు. ప్రజలందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీతో పాటు, పట్టణానికి చుట్టూ పక్కల ఉన్న అన్ని కాలనీలను కూడా అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

ఢిల్లీలో తెరుచుకున్న పాఠశాలలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): కరోనా ప్రేరేపిత లాక్‌డౌన్ మూతపడిన పాఠశాలలు ఢిల్లీలో మళ్లీ తెరుచుకున్నాయి. తొమ్మిది, 11వ తరగతి విద్యార్థులు శుక్రవారం తరగతులకు హాజరయ్యారు. బోర్డ్ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని గత నెల 18న ప్రభుత్వం పది, 12 తరగతులను ప్రారంభించింది. అయితే తల్లిదండ్రుల సమ్మతితోనే విద్యార్థులను పాఠశాలలకు పిలువాలని ప్రభుత్వం సూచించింది. ఇప్పటికే పలు రాష్ట్రాలు ముందు జాగ్రత్త చర్యలతో తరగతులను పునః ప్రారంభించాయి. ఇదిలా ఉండగా.. ఢిల్లీలో గురువారం 150 కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య 6,35,639కు చేరగా.. 6,23,574 మంది కోలుకున్నారు. పాజిటివిటీ రేటు 0.24 శాతానికి పడిపోయిందని అధికారులు తెలిపారు. మహమ్మారితో ఇప్పటి వరకు 10,871 మంది మృత్యువాతపడ్డారు. ప్రస్తుతం 1,194 యాక్టివ్ కేసులున్నాయి.

ఆల్ టైం రికార్డులు సృష్టిస్తున్న ధరలు

మరింతగా పెట్రో ధరల బాదుడు

హైదరాబాద్,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): వాహనదారులపై పెట్రోల్ ధరల బాధుడు కొనసాగుతోంది.

పెట్రోల్ ధరలు వరుసగా రెండో రోజు రేట్లు పెరిగాయి. ఇప్పటికే రికార్డు స్థాయికి రేట్లు చేరగా మరోసారి చమురు కంపెనీలు ధరలు పెంచాయి. దీంతో ఆల్ టైం రికార్డులు సృష్టిస్తున్నాయి. ఇవాళ లీటర్ పై 30 పైసలు పెరిగింది. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ 86 రూపాయల 95 పైసలకు చేరింది. డీజిల్ 77 రూపాయల 13 పైసలకు చేరింది. అటు ఆర్థిక రాజధాని ముంబైలో లీటర్ పెట్రోల్ 93 రూపాయల 49 పైసలకు చేరగా? లీటర్ డీజిల్ 83 రూపాయల 99 పైసలుగా ఉంది.మరోవైపు చెన్నైలో లీటర్ పెట్రోల్ ధర 89.39 పైసలుండగా?. డీజిల్ ధర 82 రూపాయల 33 పైసలకు చేరింది. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ 90 రూపాయల 42 పైసలుండగా? డీజిల్ ధర 84 రూపాయల 14 పైసలుగా ఉంది. అటు ఒఖలో లీటర్ పెట్రోల్ 92. 78 పైసలుండగా? డీజిల్ 85 రూపాయల 99 పైసలుగా ఉంది. కోల్ కతాలో పెట్రోల్ 88 రూపాయల 30 పైసలకు చేరుకోగా? డీజిల్ 80 రూపాయల 71 పైసలుగా ఉంది. పెట్రోలో ధరలు భారీగా పెరగటంపై మండిపడుతున్నారు వాహనదారులు. ఆయిల్ ధరలు పెరగటంతో బండ్లు అమ్ముకునే పరిస్థితి వచ్చిందన్నారు. అటు ట్రాన్స్ పోర్ట్ చార్జీలు పెరిగాయని? దీంతో నిత్యవసర వస్తువుల ధరలు భారీగా పెంచినట్లు తెలిపారు. వెంటనే చార్జీలు తగ్గించేలా? ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు వాహనదారులు.

నేడు చక్కా జామ్‌తో రహదారుల దిగ్బంధం

రైతుల ఆందోళన కార్యక్రమంతో అప్రమత్తం అయిన కేంద్రం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా శనివారం రైతులు చక్కా జామ్‌తో రహదారుల దిగ్బంధం కార్యక్రమం నిర్వహించాలని పిలుపునివ ÷-వడంతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. పోలీస్ శాఖను అప్రమత్తం చేసింది. కేంద్ర బ్జడెట్‌లో వ్యవసాయ రంగానికి కేటాయింపులు తగ్గించారని రైతు సంఘాలు విమర్శలు చేశాయి. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు దేశ వ్యాప్తంగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులను దిగ్బంధనం చేయనున్నాయి రైతు సంఘాలు. రైతుల ట్రాక్టర్ ల ర్యాలీ సందర్భంగా గత నెల 26న దేశ రాజధానిలో హింస చెలరేగిన నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు భారీ ఏర్పాట్లు చేశారు. సరిహద్దుల నుంచి రైతులు దేశ రాజధానిలోకి ప్రవేశించకుండా కేంద్ర ప్రభుత్వం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో జరుగుతున్న ఆందోళనలను కట్టడి చేసేందుకు అధికార యంత్రాంగం పక్కా ఏర్పాట్లు చేసింది. అటు కనీస మద్దతు ధరపై పార్లమెంట్‌లో కేంద్రం ప్రకటన చేసే అవకాశం అంటూ జాతీయ మీడియాలో ప్రచారం జరుగుతోంది. రైతుల చక్కా జామ్ నేపథ్యంలో గురువారం ప్రధానితో కేంద్ర మంత్రుల భేటీ జరిగింది. ఢిల్లీ పోలీసు కమిషనర్, ఇంటలిజెన్స్ ఛీఫ్ తో సమావేశమై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. అమిత్ షా నేతృత్వంలో అత్యంత ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది.

మైనార్టీల సంక్షేమంపై మంత్రి కొప్పుల సమీక్ష

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మైనార్టీల సంక్షేమంపై మంత్రి కొప్పుల ఈశ్వర్ సంబంధిత ఉన్నతాధికారులతో సుమారు రెండు గంటల పాటుసమీక్షా సమావేశం నిర్వహించారు. గురుకులాలకు సుమారు 50శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని, రోజురోజుకు ఈ సంఖ్య పెరుగుతుందని అధికారులు మంత్రికి వివరించారు. కొవిడ్ నిబంధనలు కచ్చితంగా అమలవుతున్నాయని, విద్యార్థులందరు ఆరోగ్యంగా ఉన్నారు. రెండు షిఫ్ట్ ల్లో తరగతులు నిర్వహిస్తున్నామని మంత్రికి తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, జాతీయ పోటీ పరీక్షల్లో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

సీసీ కెమెరాల ద్వారా నల్లగొండలో జంట హత్యల కేసును ఛేదించిన పోలీసులు

నల్లగొండ,ఫిబ్రవరి 5: టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన జంట హత్యల కేసులో హంతకులను సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి రిమాండ్ చేసినట్లు నల్లగొండ డీఎస్పీ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.శుక్రవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన హత్య కేసు వివరాలను వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా పత్తిపాడు మండలం పోతులూరుకు చెందిన బొండి నాగేశ్వర్ రావు, బొండి రాంజీలు నల్లగొండలో కూలీ పని చేసుకొని జీవనం సాగించేవారని తెలిపారు.నల్లగొండ పట్టణ పరిధిలోని పాతబస్తీ గిరకలబావికి చెందిన షేక్ అజీమ్, షేక్ అమీర్‌లతో కలిసి మద్యం సేవిస్తున్న క్రమంలో గత నెల 25వ తేదీన మృతుల వద్ద ఉన్న బ్యాగులో పెద్ద మొత్తంలో డబ్బులు ఉన్నట్లుగా భావించి వారిద్దరిని బండరాళ్లతో మోది హత్య చేసినట్లుగా వివరించారు. మృతులు చర్లపల్లి ప్రాంతం నుంచి గొల్లగూడ ప్రాంతానికి ఆటోలో ప్రయాణించినట్లుగా సీసీ కెమెరాల ఆధారం గుర్తించామని చెప్పారు.

ఈ కేసు విషయంలో తమ సిబ్బంది సమర్థవంతంగా పని చేసి హంతకులను, మృతులను గుర్తించారు. ఈ హత్య కేసులో సమర్థవంతంగా పని చేసిన వన్ టౌన్ సీఐ నిగిడాల సురేష్, టూ టౌన్ సీఐ చంద్ర శేఖర్ రెడ్డి, టూ టౌన్ ఎస్.ఐ. నర్సింహులు, సిబ్బంది రాజు, శంశుద్దీన్, బాలకోటి, శంకర్ లను ఆయన అభినందించి వారికి రివార్డు కోసం సిపార్సు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

జిహెచ్ఎంసి మేయర్ ఎంపికకు ఏర్పాట్లు

హైదరాబాద్,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): ఈనెల 11న జీహెచ్ఎంసీ నూతన పాలకమండలి సమావేశం, మేయర్, డిప్యూటీ మేయర్‌కు జరిగే ఎన్నికల ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, హైదరాబాద్ కలెక్టర్ శ్వేతా మహంతిపర్యవేక్షించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, ఎన్నికల విభాగం అధికారులు, కార్యదర్శులతో సమావేశమైన అనంతరం కౌన్సిల్‌హాల్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఎక్స్‌అఫీషియో, కార్పొరేటర్లకు పార్టీల వారీగా సీట్ల కేటాయింపు, కౌన్సిల్ హాల్‌లోకి ప్రవేశం, మీడియా ఎన్‌క్లోజర్ తదితరాంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 11న జరిగే సమావేశాన్ని పూర్తిగా వీడియోలో చిత్రీకరించాలని ఆమె ఆదేశించారు.

పసుపు రైతులను పట్టించుకోని కాంగ్రెస్,టిఆర్ఎస్

స్పైసెస్ బోర్డు ఏర్పాటు చేసిన తరవాతనే పెరిగిన ధరలు
మీడియాతో ఎంపి ధర్మపురి అర్వింద్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ కుంభకర్ణుడిలా నిద్రపోతూ రైతుల్ని పట్టించుకోలేదని నిజామాబాద్ బిజెపి ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు దేశ ద్రోహులని, మిలిటెంట్లని దెప్పి పొడిచారు. చివరికి సీఎం పదవులను కూడా.. పందల కోట్లకు అమ్ముకునే పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్‌ను అమ్ముకుంటున్నాడని అర్వింద్ ఆరోపించారు. పసుపు రైతులకు టీఆర్ఎస్, కాంగ్రెస్ చేసేందేమీ లేదన్నారు. వ్యాపారుల నుంచి చందాలు వసూళ్లకే రెండు పార్టీల నేతలు పరిమితమయ్యారన్నారు. తాను ఎంపీ అయ్యాకే నిజామాబాద్ లో స్పైస్ బోర్డు ఎక్స్ టెన్షన్ సెంటర్ ఏర్పాటయిందన్నారు. దీంతో నిజామాబాద్ పసుపు ఎగుమతికి హబ్ గా మారిందని చెప్పారు. దీంతోపాటు దిగుమతులపై కేంద్రం ఆంక్షలు విధించడంతో ధరలు పెరగడానికి అవకాశం వచ్చిందన్నారు. కవిత ఎంపీగా ఉన్నప్పుడు ఢిల్లీలో ఫోటోలు దిగడం తప్ప .. రైతుల కోసం ఏమీ చేయలేదన్నారు. తెలంగాణలో పసుపు పంట పండించే రైతుకు లభించే ధర క్రమంగా పెరుగుతుందన్నారు.పసుపు రైతుల కోసం వీలయినంత న్యాయం చేయాలన్నదే తన లక్ష్యం అన్నారు.

ఏరో ఇండియా ఎయిర్ షో ప్రపంచంలోనే తొలి మెగా ఈవెంట్: రాష్ట్రపతి

బెంగళూరు, ఫిబ్రవరి 5: ఏరో ఇండియా-2021 పేరుతో కర్ణాటక రాజధాని బెంగళూరులోని యెలహంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో జరిగిన ఎయిర్ షో ప్రపంచంలోనే తొలి మెగా ఈవెంట్ అని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు. ఫిబ్రవరి 3న ప్రారంభమైన మూడు రోజుల ఎయిర్ షో ముగింపు కార్యక్రమంలో ఈ సాయంత్రం రాష్ట్రపతి ప్రసంగించారు. ఏరో ఇండియా ఎయిర్ షో అపూర్వ విజయం సాధించిందని ఈ సందర్భంగా రాష్ట్రపతి వ్యాఖ్యానించారు. ఈ ఎయిర్ షోలో మొత్తం 43 దేశాలకు చెందిన 530 సంస్థలు పాల్గొన్నట్లు నిర్వాహకుల ద్వారా తెలుసుకున్నానని రాష్ట్రపతి చెప్పారు. వర్చువల్ పద్ధతిలో కూడా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు, సంస్థలు ఎయిర్ షోలో పాల్గొన్నాయని రాష్ట్రపతి తెలిపారు. మూడు రోజులపాటు జరిగిన ఈ ఎయిర్ షోలో వివిధ దేశాలు, కంపెనీల మధ్య ఒప్పందాలు, అంగీకారాలు, సహకారాల రూపంలో మొత్తం 201 నూతన వ్యాపార భాగస్వామ్యాలు కుదిరాయని నిర్వాహకులు చెప్పినట్లు రాష్ట్రపతి తెలిపారు.

చరిత్రలో నేటినిజం

తం॥ ఆసలాం ధనమున నెలిచెడి
'బరసెలాటు బాలే మహిళయైన ప్రతిమాసింగనే
బాసలర ఆనయుగ మెశసెడి
ఆ సొదరమున్నయట్టి అబలగ నాటుతునే !!

(ఫిబ్రవరి 6 బాస్కెట్‌బాల్ ఆటగత్తె
ప్రతిమాసింగ్ జననం..)

-రాధశ్రీ
సెల్: 9494481210

నేటినిజం
శనివారం 6-2-2021

మాయ మాటలు మాని ....

రైతు చట్టాలపై చర్చించాల్సిందే !

వ్యవసాయ చట్టాల విషయంలో మంచీచెడులపై చర్చ కన్నా..రైతుల ఆందోళనలను అణచివేసే కార్యక్రమంపైనే ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. నిజానికి జనవరి 26న జరిగిన ఘటన తరవాత అయినా రైతులకు చట్టాలపై అవగాహన కలిగించే చర్యలకు ఉపక్రమించడంలేదు. కనీసం పార్లమెంట్ వేదికగా అయినా ఆ ప్రయత్నం చేయాలన్న ఆలోచన కానరావడం లేదు. ఒకవేళ ప్రభుత్వం తీసుకుని వచ్చిన చట్టాలు మేలు చేసేవే అయితే...దేశానికి అవసరమైనవే అయితే వీటి గురించి గట్టిగా చెప్పాలి. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న వేళ దీనిపై సమగ్రంగా చర్చించాలి. ఎందుకు ఈ చట్టాలు మంచివో చెప్పి ఒప్పించాలి. చట్టాలను ఆమోదించినప్పుడు సమగ్ర చర్చ ఎలాగూ చేయలేదు. నబంర్‌గేమ్‌లో వీటిని ఆమోదింప చేశారు. ఇలా వ్యతిరేకత వస్తుందని ప్రభుత్వం ఊహించి ఉండకపోవచ్చు. ఇకపోతే ఈ చట్టాలు మంచివని, రైతలకు మేలు చేసేవి అని ప్రధాని మోడీ మరోమారు ఉద్ఘాటించిన వేళ..ఇంతకన్నా మంచి తరుణం లేదు. పదేపదే చట్టాలు మంచివని చెప్పినంత మాత్రాన మంచిది కాదు. దేశ ప్రజలు కూడా ఇప్పుడుచట్టాల మంచీచెడులను తెలుసుకోవాల్సి ఉంది. చట్టాలపై సమగ్ర చర్చ చేయడం ద్వారా రైతులు చేస్తున్న ఆందోళన మంచిదైతే వారిని.. అప్పుడు ఒప్పించి ఆందోళన విరమింపచేయవచ్చు. అంతేగా గానీ సరిహద్దుల్లో కంచెలు వేసి కాదు. కంచెలు వేయడం వల్ల చట్టాలు మంచివైపోవు. రైతులను నిరోధించడం ద్వారా ఆందోళనలు సమిసి పోవు. దేశంలో మరింత ఆందోళనకర పరిస్థితులు రాకుండా చూడాలి. గతంలో లాగా నిరంకుశ వైఖరితో పోవడంకన్నా చట్టాల ద్వారా రైతులకు మేలు జరిగే చర్చలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పార్లమెంటులో మరోమారు చట్టాలపై చర్చించడం ద్వారా ...ఎందుకు చట్టాల వల్ల రైతులకు మేలు కలుగు తుందో చెప్పడం ప్రభుత్వ బాధ్యత. అలా చేస్తేనే సమాజంలో ఉన్న అనుమానాలు తొలగిపోయాయి. మోడీ నిర్ణయం కరెక్ట్ అయితే అంతకు రెట్టింపు మద్దతు దక్కవచ్చు. లేకుంటే చట్టాల ఉపసంహరణ చేసుకోవడం లో తప్పులేదు. ప్రజాస్వామ్యంలో బుల్‌డోజ్ విధానాలు సరికాదు. రైతుల ఆందోళన తప్పయితే.. వారి ఆందోళనలో నిజాయితీ లేకపోతే వారిని ఎండగట్టవచ్చు. కానీ దానికి వేదిక మాత్రమే పార్లమెంట్ అని ప్రభుత్వం గుర్తించాలి.విపక్షాలు రైతులను కలవడానికి వెళ్లినా అనుమతించక పోవడం అన్నది ఓ రకమైన భయంగా గుర్తించాలి. నిజానికి ప్రభుత్వం ఎందుకు భయపడుతోంది. ఎందుకు నిజాలు దాస్తోందన్న విషయం కూడా బయటకు రావాలి. పార్లమెంటు ఉభయసభలూ బుధవారం నాడు కూడా రైతు సమస్యలపై దద్దరిల్లాయి. మోడీ ప్రభుత్వం రూపొందించిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రెండు సభల్లోనూ ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. దీంతో లోక్‌సభ వాయిదాల బాట పట్టింది. రాజ్యసభ ఉదయం ప్రారంభమైన వెంటనే వెంటనే రైతుల ఆందోళనపై చర్చ చేపట్టాలని ప్రతిపక్షాలు పట్టబట్టాయి. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానంపై 15 గంటల పాటు చర్చించేందుకు ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య అంగీకారం కుదిరింది. ఈ అంశంపై చర్చకు తొలుత పది గంటలు కేటాయించగా, మరో ఐదు గంటలపాటు సభలో చర్చ జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.దీనిపై స్పందించిన పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, ప్రతిపక్షాల డిమాండ్‌ను అంగీకరిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీ సరిహద్దు ల్లో ఆందోళన చేస్తున్న రైతు సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ లోక్‌సభలో వరుసగా మూడవ రోజు కూడా ప్రతిపక్ష పార్టీల సభ్యులు డిమాండ్ చేశారు. మరోవైపు రాజ్యసభలో ఢిల్లీ సరిహద్దుల్లోని పోరాట శిబిరాల వద్ద రైతుల దుస్థితిని వివరిస్తూ పలువురు ప్రతిపక్ష నేతలు ఉద్విగ్నతకు గురయ్యారు. కొందరు కన్నీళ్లు సైతం పెట్టుకున్నారు. గురువారం లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు వ్యవసాయ చట్టాలపై ఆందోళన చేపట్టారు. స్పీకర్ పోడియం వద్దకు వచ్చి ప్లకార్డులతో నినాదాలు చేశారు. రైతులపై తీసుకున్న చర్యలను ఉపసంహరించుకోవాలని ప్రతిపక్షాలు కోరాయి. ఈ మేరకు గురువారం పది ప్రతిపక్ష పార్టీల ఎంపిలు సంయుక్తంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. రైతుల ఆందోళన ప్రాంతాల్లో విద్యుత్, నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. మొత్తంగా చట్టాలను రద్దు చేయడం లేదా.. చర్చించి ఆమోదించేలా చేయడం మాత్రమే ప్రభుత్వం ముందున్న లక్ష్యాలుగా ఉండాలి. చట్టాలు మంచివేతే ఎందుకు మంచివో చెప్పాలి. కాకుంటే ఎలాంటి షరతలులు లేకుండా వెనక్కి తగ్గాలి. ప్రజాస్వామ్యంలో చర్చలే ప్రధాన విషయంగా ఉండాలి. మరోవైపు ప్రభుత్వంతో అమీతుమీ తేల్చు కునేందుకు సిద్ధమైన రైతు సంఘాలు కేంద్రంపై దాడిని మరో మలుపు తిప్పుతున్నాయి. ఆందోళనకు గట్టి నాయకుడిగా మారిన బీకేయూ జాతీయ కార్యదర్శి రాకేశ్ తికాయత్ కేంద్రంపై దాడికి దిగారు. చట్టాలను రద్దు చేయకుండా మొండి పట్టుదలతో వ్యవహరిస్తే అధికారం కోల్పోవలసి వస్తుందని ఆయన ప్రధాని నరేంద్ర మోదీని పరోక్షంగా హెచ్చరించారు. ఇకపోతే బిజెపిలోని సీనియర్లు కావచ్చు..లేదా ఇతర నేతలు కావచ్చు ఈ ఆందోళనలను ప్రేక్షకుల్లాగా చూస్తూ కూర్చోవడం సరికాదు. ద్రౌపది వస్త్రాపహరణం జరుగుతున్న వేళ నోరు మెదపక భీష్మాది కురువృద్ధులు మౌనం దాల్చారు. ఇది అన్యాయమని ఏ ఒక్కరూ అడ్డుకోలేక పోయారు. ఎందుకిలా చేస్తున్నారని ప్రతిఘటించలేక పోయారు. చివరకు కురుక్షేత్ర సంగ్రామం తప్పలేదు. ఆనాడు ఈ పెద్దల మౌనం కారణంగానే ఉపద్రవం ముంచుకుని వచ్చింది. ఈ దశలో ఎవరికి వారు తమ స్థాయిలో మంచీచెడులను చర్చించాలి. కొందరు మేధావులు కూడా ఈ చట్టాలను స్వాగతిస్తున్నారు. అయితే తమకు అనుకూలురైన వారితో కూడా చర్చ చేయించి చట్టాలు ఎందుకు మంచివో చెప్పాలి. అంతిమంగా పార్లమెంటులో జరిగే చర్చలకే ప్రాధాన్యం ఉంటుంది. ఎలాగూ సమావేశాలు జరుగుతున్నాయి గనక చర్చ ద్వారా ప్రభుత్వం మంచీచెడులపై సమగ్ర చర్చకు సిద్ధం కావడం ద్వారా రైతులను, ప్రజలను మెప్పించ గలగాలి. అప్పుడే ప్రధాని మోడీ పదేపదే చెబుతున్న విషయాలపై నమ్మకం ఏర్పడుతుంది. లేకుంటే మోడీని సమర్థించే వారికి సైతం అనుమానాలు కలుగక మానవు.

మళ్లీ హూంకరిస్తున్న గులాబీ గళాలు

రైతులకు మద్దతుగా స్వరం పెంచుతున్న మంత్రులు
కేంద్ర వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలంటూ ప్రకటనలు
గతంలో బంద్‌తో మద్దతు ఇచ్చి ..వెనక్కి తగ్గిన టిఆర్ఎస్
తాజా పరిణామాలతో మళ్ళీ బిజెపికి వ్యతిరేకంగా నినదిస్తున్న నేతలు

హైదరాబాద్,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): కేంద్ర వ్యవసాయ చట్టాలపై అధికార టిఆర్ఎస్ ఇక సమరశంఖం పూరించనుందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఇంతకాలం మౌనంగా ఉంటూ వస్తున్న నేతలు మెల్లగా గళం విప్పుతున్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ఆందోళనల నేపథ్యంలో ఇంతకాలం మౌనంగా ఉన్న పార్టీ మళ్లీ మద్దతు ఇచ్చేలా గట్టిగానే మాట్లాడుతోంది. గతంలో రైతులకు మద్దతుగా బంద్‌లో పాల్గొన్న టిఆర్ఎస్ ఆ తరవాత ఎందుకనో వెనక్కి తగ్గింది. తాజాగా మళ్లీ మంత్రులు గళం విప్పుతున్నారు. ఢిల్లీలో రైతులు పట్టుదలగా పోరాటం చేయడంతో వారికి మద్దతుగా మాట్లాడుతున్నారు. తాజాగా మంత్రులు ఈటెల రాజేందర్,హరీష్ రావుల వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనంగా చూడాలి. వ్యవసాయ చట్టాలపై కేంద్రం పునరాలోచించాలని మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. అన్నం పెట్టే రైతుల కళ్ళల్లో మట్టి కొట్టొద్దన్నారు. రైతులు గిట్టుబాటు ధర అడగడం తప్పా? అని ప్రశ్నించారు. రైతు వేదికలు చర్చా వేదికలు కావాలన్నారు.

తెలంగాణ వచ్చిన తరువాత రాష్ట్రంలోని రైతుల కష్టాలు తీరాయని, సాగునీటి కోసం 24 గంటల నాణ్య మైన విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏ కార్యక్రమం చేసినా దాని వెనుక కన్నీళ్లు, బాధలకు పరిష్కారం చెప్పే ఆలోచన ఉంటుందని అన్నారు. రైతు బంధు, రైతు భీమా అందులోనుంచే వచ్చాయన్నారు. తెలంగాణలో రైతులు పండించిన ధాన్యం మొత్తం కొనే స్థోమత మిల్లర్ల దగ్గర లేదన్నారు. ఐకేపీ సెంటర్స్ తోనే అది సాధ్యం అవుతుందని, ఐకేపీ సెంటర్‌లో వడ్లు కొంటేనే మహిళలకు ఉపాధి దొరుకుతుందని చెప్పారు. రైతులు ఇప్పుడిప్పుడే అన్నం తింటున్నారని తెలిపారు. ఎమ్మెస్పీ ప్రకారం ధాన్యం కొనాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగం కూడా డిల్లీ ఉద్యమానికి మద్దతు పలుకుతున్నారు. కానీ అక్కడ రైతుల కష్టాలు ఎలా ఉన్నా మన రాష్ట్రంలో మాకు ఏమీ కాదు అనే నమ్మకం రైతులకు ముఖ్యమంత్రి కేసీఆర్ మీద ఉందని అన్నారు. ఇకపోతే దేశంలో రైతుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. సీఎం కేసీఆర్ ముందు చూపుతో రాష్ట్రంలోని రైతులకు ఊరట లభించిందని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మెదక్ పట్టణంలో రైతు వేదికను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో వ్యవసాయం అంటే రైతుల ఆత్మహత్యలు, కరెంటు కోతలు ఉండేవన్నారు. దేశంలో కాంగ్రెస్ బీజేపీ పాలిత ప్రాంతాల్లో రైతులకు ఉచిత కరెంట్, పెట్టుబడి సాయం ఎక్కడా లేదన్నారు. సంక్షేమ పథకాల అమల్లో తెలంగాణకు దరిదాపులో ఏ రాష్ట్రం లేదన్నారు. మూడు సంవత్సరాల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణ పథకాలను బీజేపీ ప్రభుత్వం కాపీ కొడుతుంది. 70 సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధి ఏడు సంవత్సరాల్లో తీసుకొచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచామని పేర్కొన్నారు. తెలంగాణలో వాణిజ్య పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కందులకు ఆరు వేల రూపాయలు వచ్చే వరకు ఎవరు అమ్మకూడదన్నారు. 24 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు రైతుల కోసం నిర్మించామని వివరాలను వెల్లడించారు. తెలంగాణలో 50 లక్షల ఎకరాల్లో యాసంగి పంట సాగు చేస్తున్నారు. మరో 25 లక్షల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నదని తెలిపారు. మొత్తంగా అక్కడక్కడా గత కొన్ని రోజులుగా మంత్రులు, ఎమ్మెల్యేలు రైతలకు మద్దతుగా మాట్లాడుతున్నారు. రాజ్యసభలో విపక్షనేతలు గురువారం ప్రభుత్వాన్ని గట్టిగానే నిలదీశాయి.

మెదక్,పెద్దపల్లి జిల్లాలకు నూతన కలెక్టర్లు

హైదరాబాద్,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): మెదక్,పెద్దపల్లి జిల్లాలకు నూతన కలెక్టర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రంగారెడ్డి అదనపు కలెక్టర్ ఎస్.హరీశ్‌ను మెదక్ కలెక్టర్‌గా అదేవిధంగా సీఎంఆర్‌వో ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణను పెద్దపల్లి కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. కాగా ప్రస్తుతం మెదక్ కలెక్టర్‌గా ఉన్న పి. వెంకట్రామిరెడ్డి, పెద్దపల్లి కలెక్టర్‌గా ఉన్న భారతీ హోళికేరీని ఆయా స్థానాలనుండి రిలీవ్ చేసింది.

భూ నిర్వాసితుల ఆత్మహత్యాయత్నం

సిద్దిపేట,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): ప్రాజెక్టు నిర్మాణంలో కోల్పోయిన తన భూమికి కాలం గడుస్తున్నా పరిహారం చెల్లించకపోవడంతో ఆవేదనతో భూనిర్వాసితురాలు ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఈ ఘటన జిల్లాలోని అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగింది. మండలంలోని గుడాటిపల్లికి చెందిన సున్నపు శారద తన భూమిని గౌరవెల్లి ప్రాజెక్టులో కోల్పోయింది. అయితే రెండేళ్లు గడుస్తున్నా కోల్పోయిన భూమికి పరిహారం చెల్లించకుండా ఆఫీసుల చుట్టూ తనను అధికారులు తిప్పుంచుకుంటున్నారని మనస్తాపం చెందింది. పరిహారం కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన ఆమె అక్కడే ఆత్మహత్యాయత్నం చేసింది. అయితే అధికారులు ఆమెను అడ్డుకుని నిలువరించారు. ఈ సంఘటన మండలంలో సంచలనం రేపింది.

సోషల్ మీడియా వేదికగా వేధింపులు

–చర్యలు తీసుకోవాలంటూ సిపికి మాధవీలత ఫిర్యాదు

హైదరాబాద్,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): ఉద్దేశపూర్వకంగా తనను సోషల్ మీడియాలో వేధింపులు చేస్తున్నారని.. ఓ వర్గం వారు వ్యక్తిగతంగా దూషిస్తూ అసభ్యకర పోస్టులు చేస్తున్నారని సినీ నటి, బీజేపీ నాయకురాలు మాధవీలత పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీసులకు విజ్ఞప్తి చేసింది.

ఈ మేరకు గురువారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను కలిసి లిఖిపూర్వకంగా ఫిర్యాదు ఇచ్చింది. నచ్చావులే, స్నేహితుడా తదితర సినిమాలు చేసిన మాధవీలత కొన్నేళ్ల కిందట బీజేపీలో చేరింది. ప్రస్తుతం ఆమె రాజకీయాల్లో చురుగ్గా ఉంటోంది.

అయితే ఇటీవల ఆమెను సోషల్ మీడియాలో తీవ్ర వేధింపులకు పాల్పడుతున్నారని సైబరాబాద్ కమిషనర్ సజ్జనార్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. సోషల్ మీడియాలో ఓ వర్గం తనను లక్ష్యంగా చేసుకుని అసభ్య పోస్టులు చేస్తున్నారని తెలిపింది. ఏదైనా కేసులో అమ్మాయిలు పట్టుబడితో అందులో తాను ఉన్నానని లేనిపోనివి కథనాలు సృష్టిస్తున్నారని చెప్పింది. దీనిపై ఇన్నాళ్లు సోషల్ మీడియాలో పోరాటం చేశానని.. ఇకపై మీరు చూసుకోవాలని కమిషనర్‌ను మాధవీలత కోరింది. ఈ తప్పుడు ప్రచారం తనను మానసికంగా కుంగదీస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. వేధింపులకు పాల్పడుతున్న నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ పోలీసులను ఆమె విజ్ఞప్తి చేసింది.

దేశం ఆర్థికంగా బలంగా ఉంటే ధరల దౌడు ఎందుకు?

అచ్ఛేదిన్ పేరుతో ఇంకెంతకాలం వంచన చేస్తారు
పెట్రో ధరలు ఎందుకు ఇబ్బడిముబ్బడిగా పెంచుతున్నారు
ప్రజలకు అశలు కల్పించి మోసం చేస్తోన్న మోడీ సర్కార్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): దేశం ఆర్థికంగా బలంగా ఉందంటే ధరలు ఎందుకు పెరిగాయి. ద్రవ్యోల్బణం ఎందుకు కలవరపెడుతోంది. నిరుద్యోగం ఎందుకు తాండవిస్తోంది. రైతులకు ఎందుకు గిట్టుబాటు ధరలు దక్కడంలేదు. దేశంలో రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎందుకు ప్రజలకు కనీస వైద్య సేవలు అందడం లేదు. ఎందుకు ఇంకా సమస్యలు వెన్నాడుతున్నాయి. పెట్రో ధరలు ఇబ్బడిముబ్బడిగా ఎందుకు పెంచుతున్నారు. అన్న దానికి సమాధానం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి ఫీట్లు చేస్తే నిజంగానే పట్టించుకోవాల్సిన అవసరం లేదు. కానీ ప్రజల్లో ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన బిజెపి చేస్తున్న ఫీట్లు చూస్టుంటే ఏవగింపు కలగక మానదు. ప్రజలను వంచించడం తప్ప మరోటి కాదు. కాంగ్రెస్ పార్టీ కోవలోనే బిజెపి ప్రయాణించడం దారుణమైన విషయంగా పరిగణించాలి. ప్రపంచంలోనే శరవేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ మరోసారి మెరుపులు మెరిపించనుందని, ఆర్థిక సర్వే ద్వారా చెప్పించి ఎవరిని మోసం చేయబోతున్నారో బిజెపి పాలకులు చెప్పాలి. ఒక్క నిత్యావసరాల ధరలను తీసుకుంటే చాలు...వీరి పాలన ఎంత దారుణంగా ఉందో చెప్పవచ్చు. బిజెపి పాలకులు సరే..పార్టీలోలని నేతలయినా ఈ పరిస్థితులపై స్పందించడం లేదు. ఇప్పుడు బిజెపిలో ఉన్న పెద్దల మౌనం కారణంగా దేశం మూల్యం చెల్లించుకుంటోంది. వీరంతా దేశం బాగుందన్న, ప్రజలు బాగున్నారన్న, ఆర్థికస్థితి బాగుందన్న అతి ప్రచారాన్ని చూస్తూ ఊరుకుంటున్న తీరు సరికాదు. అంతా ఫీల్‌గుడ్ వ్యవహారం...ఆర్థిక సర్వే అమోఘం...దేశం ఆర్థికంగా దూసుకుని పోతోంది. భారత్ వృద్ధిరేటు బాగుందని విదేశీ సంస్థల కితాబు.. వంటివన్నీ ప్రజల స్థితిగతులను చూస్తే ఎంత డొల్లనో అర్థం చేసుకోవచ్చు. ఇంత అభివృద్ధి సాధిస్తే దేశం తిరోగమన దిశగా ఎందుకు పరుగెడుతుందన్నది అర్థం కాని ప్రశ్న. ఆర్థిక సర్వేకు అసలు నిజాలకు పొంతన లేని లెక్కలు పార్లమెంటుకు చేరాయి. ఆశాజనకమైన అంచనాలు అత్యంత బలహీనమైన ప్రాతిపదికలుగా ఆర్థిక వ్యవస్థలను చూపడం ఎంతవరకు సమంజసమో చెప్పాలి. ఆర్థిక రంగంలో పొంచి ఉన్న సవాళ్లపై సర్వే చేసిన హెచ్చరికలే ఇందుకు ఉదాహరణ. ఈ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకుంటే ఆర్థిక రంగంపై ఆశలు కల్పించడానికి సర్వే చేసిన ప్రయత్నాలు వీగిపోతాయి. యావత్తూ ప్రైవేటు పెట్టుబడులు, ప్రజా వ్యతిరేక సంస్కరణలు, జనంపై భారాల చుట్టూనే సర్వే తిరిగింది. తాము చేపట్టిన సంస్కరణల వలన వృద్ధి రేటు పెరుగుతుందని ఊదరగొడుతుండగా వాస్తవాలను దాచిపెట్టేలా మసిపూసి మారేడు కాయ చేసిన తీరు స్పష్టంగా గోచరిస్తోంది. దేశంలో ప్రజల జీవనస్థితిగతులను గమనిస్తే మనం ఎంత అధ్వాన్నమైన ఆర్థిక వ్యవస్థలో కూరుకుని పోయామో గమనించ వచ్చు. సగటు మనిషటి దగ్గరికి వెళ్లి బతుకును ప్రశ్నిస్తే మన బండారం బయటపడుతుంది. లెక్కలు వేయడం గొప్పతనం కాదు. లెక్కలకు అనుగుణంగా దేశం ముందుకు వెళుతుందా లేదా అన్న లెక్కలు తీయాలి. గతానునుభవం నుంచి గుణపాఠం నేర్చుకోకుండా వృద్ధి రేటును ఘనంగా చెప్పుకోవడం ప్రజలను వంచించడమే అవుతుంది. లెక్కలు వేసి పేపర్లపై చూపినంత మాత్రాన ప్రజల జీవనస్థితిగతులు మారవు. అలాంటి ప్రయత్నాలు చేస్తే ప్రజలు బిజెపిని నమ్మరు. బిజెపిపై ప్రజలకు ఇంతకాలం ఒక ఇమేజ్ ఉండేది. కానీ గత ఆరేళ్లుగా ఆ ఇమేజ్ పూర్తిగా తొలగిపోయింది. వారు ఇతరులకన్నా ఎక్కువే తప్ప ప్రత్యేకం కాదని మోడీ సేన నిరూపించింది. ఉపాధి, ఉద్యోగాల కల్పన, వ్యవసాయాభివృద్ధి, విద్య,వైద్యం వంటి సమస్యలను దేశం తీవ్రంగా ఎదుర్కొంటున్న వేళ ఆరేళ్లలో ఇసుమంత మార్పుకూడా గోచరించలేదు. మోడీ సర్కారు వచ్చాక అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినప్పటికీ ప్రజలకు భారంగా మారిన పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గలేదు సరికదా రోజువారీ విధానాలతో వాహనదారుల నడ్డి విరిచారు. ఏడాదికి కోట్లల్లో కొత్త ఉద్యోగాలు సృష్టిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చిన బిజెపి ఇచ్చిన కొత్త ఉద్యోగాలెన్నని అడిగితే చెప్పలేని పరిస్థితిలో ఉంది. ఉద్యోగాలంటే ప్రభుత్వ ఉద్యోగాలు కావంటున్న వారు ప్రైవేట్ రంగంలో అయినా అవకాశాలు కల్పించారా అంటే అదీలేదు. మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్‌లు అంటూ ఊదరగొట్టిన తీరుతో యువత విసిగి వేసారింది. పాలకులకు ఈ ఆరేళ్ల తక్కువ సమయం ఏమాత్రం కాదు. రాజకీయ సంకల్పం ఉంటే, ధృఢచిత్తం ఉంటే సాధించనిదేమీ లేదు. కానీ అలాంటిదేమీ జరక్కపోగా నోట్లరద్దు, జిఎస్టీతో ప్రజల నడ్డి విరిచి కోలుకోలేకుండా చేసి అంతా అభివృద్ధి సాధించామని, తాము చేపట్టిన ఈ సంస్కరణలు ఫలితం ఇస్తున్నాయని చెప్పుకోవడం దేశ ప్రజలను వంచించడం తప్ప మరోటి కాదు. మోదీ ప్రభుత్వం ఊరిస్తున్న అచ్ఛేదిన్‌ను పెద్ద నోట్ల రద్దు, హడావుడిగా ఆమోదింపచేసుకున్న జిఎస్‌టి దెబ్బకు కుప్పకూలిన ఆర్థికరంగం దౌడు గుర్రంలా పరుగెడుతోందని చెప్పుకుంటే సరిపోదు. ఆర్థిక రంగాన్ని చావుదెబ్బతీసిన ఈ రెండు చర్యల ప్రతికూల ప్రభావం సమసిపోయిందని చెప్పుకున్నంత మాత్రాన క్షేత్రస్థాయిలో నిజాలను దాచలేమని గుర్తుంచుకోవాలి.

విశాఖ ఉక్కుకు బిగుస్తున్న ఉచ్చు

ప్రైవేటీకరణకే మోడీ సర్కార్ మొగ్గు
పోరాడి సాధించుకున్న ఉక్కును తన్నుకుపోతున్న గద్దలు

విశాఖపట్నం,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): ప్రైవేటీకరణతో ప్రభుత్వ రంగ సంస్థల గొంతుకోస్తున్న దశలో..విశాఖ స్టీల్ ప్లాంట్ కూడా అందులో చర్చడం దారుణం కాక మరోటి కాదు. ఎంతో పురోగమిస్తూ.. వేలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న ఈ సంస్థను వదిలించుకోవాలన్న మోడీ సర్కార్ నిర్ణయం నిజంగా ద్రోహపూరిత చర్యగా గుర్తించాలి. ఆంధ్రుల పోరాటంతో విశాఖలో ఏర్పాటయిన విశాఖ ఉక్కులో నూటికి నూరుశాతం కేంద్రం పెట్టుబడులు ఉన్నాయి. విశాఖ ఉక్కులోని వాటాలను విక్రయించాలని కొన్నాళ్లుగా భావిస్తున్న కేంద్రం... ముందుగా పోస్కోను రంగంలోకి దింపింది. దక్షిణ కొరియాకు చెందిన ఈ సంస్థ నాణ్యమైన స్టీల్‌ను తయారుచేస్తుందని, విశాఖ ఉక్కుకు చెందిన భూములు దానికి ఇవ్వడానికి ఒప్పందం చేసుకుంది. కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నా దీనిపై ముందడుగు వేస్తోంది. ఇప్పుడు ఏకంగా 100 శాతం వాటా విక్రయించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని విక్రయించకుండా ప్రభుత్వ రంగంలోనే కొనసాగించడానికి అనేక మార్గాలు ఉన్నాయి.

ప్రస్తుతం స్టీల్‌కు డిమాండ్ పెరిగింది. టన్ను టోకున రూ.50 వేలు చొప్పున విక్రయిస్తున్నారు. గత డిసెంబరులో రూ.2,200 కోట్ల విలువైన ఉత్పత్తులు విక్రయించగా, రూ.200 కోట్ల నికర లాభం వచ్చింది. సమీప భవిష్యత్తులోను ఇదే ఒరవడి కొనసాగుతుందని, అమ్మకాలు బాగుంటాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఒక్క రెండేళ్లు మార్కెట్ బాగుంటే నష్టాలను రికవరీ చేసి మళ్లీ లాభాల బాటలోకి వస్తామని, ప్రైవేటీకరణ చేయవద్దని, వాటాలు విక్రయించవద్దని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి

.విశాఖ ఉక్కు కర్మాగారంలో పెట్టుబడులను ఉపసంహరించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. వారం క్రితమే కేంద్ర కేబినెట్‌లో ఈ విషయం ఎజెండాలో పెట్టి చర్చించారని అధికార వర్గాలు ధ్రువీకరించాయి. విశాఖ ఉక్కుతో పాటు దాని అనుబంధ సంస్థల్లో కూడా పెట్టుబడుల ఉపసంహరణపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలోని ప్రత్యామ్నాయ యంత్రాంగానికి అప్పగించారు. బలమైన మదుపరుల ఆసక్తి మేరకు అనుబంధ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ విషయం నిర్ణయిస్తారు. ఏటా 6.3 మిలియన్ టన్నుల ఉత్పాదక సామర్థ్యం ఈ పరిశ్రమ సొంతం. 2017 నుంచి విశాఖ ఉక్కు భారీ నష్టాలతో నడుస్తోందని, 2019లో రూ.96.71 కోట్ల లాభాన్ని సాధించినప్పటికీ మళ్లీ 2020లో నష్టాల బాటలో నడిచిందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

విశాఖ ఉక్కుకు సొంత గనులు లేవు. మార్కెట్ ధరకు ఖనిజాన్ని కొనాల్సి వస్తోంది. నష్టాలకు ఇదే కారణమని కేంద్ర ఉక్కు శాఖ తన నివేదికలో పేర్కొంది. దీనివల్ల ప్రతి టన్నుకు కనీసం రూ.5 వేలు నష్టం వస్తోంది. దీనికితోడు పాలకుల సహకారం అసలే లేదు. అయినా ఇతర కంపెనీలతో పోటీ పడుతోంది. విశాఖ ఉక్కులో 17 వేల మంది పర్మనెంట్ ఉద్యోగులతో పాటు మరో 15 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. ఆర్ఐఎన్ఎల్‌కు ఒడిశా మినరల్ డెవల్‌పమెంట్స్ కంపెనీ (ఓఎండీసీ), బిస్రా స్టోన్ లైమ్ కంపెనీ లిమిటెడ్ (బీఎస్ఎల్‌సి) అనే అనుబంధ సంస్థలు ఉన్నాయి. అమరావతిలో నిర్మాణాలు సహా పలు భారీ ప్రాజెక్టులు నిలిచిపోవడం, కరోనా, లాక్‌డౌన్ వంటి కారణాలతో రూ.15,920 కోట్ల దగ్గరే ఆగిపోయాయి.

దాంతో రూ.3,910 కోట్లకు నష్టాలు పెరిగాయి. ఆ తరువాత ముడిఇనుము, కోకింగ్ కోల్, డోలమైట్ వంటి ముడి సరకుల ధరలు పెరగడంతో ఉత్పత్తి వ్యయం పెరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అన్న నినాదంతో పోరాడి, 70 మంది ప్రజా ప్రతినిధులు రాజీనామాలు చేసి, కేంద్రం మెడలు వంచి సాధించుకున్న పరిశ్రమ విశాఖ స్టీల్‌ప్లాంట్. ఇది ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక. 32 మంది ప్రాణత్యాగంతో ఏర్పడిన ఆంధ్రుల గుండెకాయలాంటి ఈ పరిశ్రమను మోడీ సర్కారు బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేయడానికి పూనుకుంది. బడ్జెట్‌లో ఈ విషయాన్ని ప్రస్తావించ కుండానే లోపాయికారీగా ప్రైవేటువ

నేడు రహదారుల దిగ్బంధం

మూడు గంటల పాటు నిరసన
రైతు సంఘాల ఐక్య వేదిక సంయుక్త్ కిసాన్ మోర్చా పిలుపు
దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధమైన రైతులు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): ఈ శనివారం మూడు గంటల పాటు రహదారుల దిగ్బంధం చేసి నిరసన తెలియజేయనున్నట్లు భాతీయ కిసాయన్ యూనియన్ నేత రాకేష్ తికాయత్ తెలిపారు. నిరసనలో ఉన్న ప్రజలకు ఆహారం, నీళ్లు తామే అందజేస్తామని, దానితో పాటు ప్రభుత్వం తమతో వ్యవహరిస్తున్న తీరును వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు. హర్యానాలోని జింద్‌లో చేపట్టిన నిరసనకు భారీ ఎత్తున స్పందన రావడంతో మరింత దూకుడుగా ముందుకు వెళ్తున్నారు.

వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న రైతులు దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధమయ్యారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు దేశవ్యాప్తంగా రోడ్లన్నీ దిగ్బంధించి నల్ల చట్టాలపై నిరసన తెలపాలని మంగళవారం రైతు సంఘాల ఐక్య వేదిక సంయుక్త్ కిసాన్ మోర్చా పిలుపునిచ్చింది. జనవరి 26న జరిగిన విధ్వంసం అనంతరం ఇంటర్నెట్ సేవలు నిలిపివేయడాన్ని రైతులు తప్పు పడుతున్నారు. ప్రభుత్వం కావాలనే తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని వారు విమర్శిస్తున్నారు. ఇక దేశ రాజధాని సరిహద్దుల్లో నిరసన జరుగుతున్న ప్రదేశాల్లో పెద్ద ఎత్తున భారీకేడ్లు ఏర్పాటు చేయడాన్ని, వేల సంఖ్యలో పోలీసు బలగాల్ని మోహరించడాన్ని ఖండించారు.

భారతదేశ ఐక్యతను ఏ ప్రచారం దెబ్బతీయలేదు

రైతు ఉద్యమానికి అంతర్జాతీయ మద్దతుపై అమిత్ షా ఫైర్
అభివృద్ధే దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది

న్యూఢిల్లీ,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): అంతర్జాతీయ ప్రముఖుల మద్దతుపై విదేశాంగ శాఖ సైతం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఘాటుగా స్పందించారు. రైతుల ధర్నాకు ప్రముఖుల మద్దతును ఆయన తీవ్రంగా ఖండించారు. భారతదేశ ఐక్యతను ఏ ప్రచారం దెబ్బతీయలేదన్నారు. అభివృద్ధే దేశ భవిష్యత్ ను నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మూడు వివాదాదస్పద రైతు చట్టాలను నిరశిస్తూ దేశ వ్యాప్తంగా రైతులు చేపడుతున్న ఉద్యమానికి అంతర్జాతీయంగా మద్దతు లభిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన ప్రముఖులు రైతు దీక్షలకు తమవంతు మద్దతు తెలుపుతున్నారు. ఈ మేరకు బుధవారం నుంచి ట్విటర్ వేదికగా రైతులకు సంఘీభావం తెలుపుతున్నారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా కర్కశులు చేస్తున్న ఉద్యమం విజయవంతం కావాలని వారు ఆకాంక్షిస్తున్నారు. రైతు దీక్షలకు మద్దతు తెలుపుతూ ప్రపంచ ప్రముఖులు చేస్తున్న ట్వీట్ పై భారత్ కు చెందిన పలువురు ప్రముఖులు ఘాటుగా స్పందిస్తున్నారు. భారత ఐక్యతకు కట్టుబడి ఉండాలంటూ వారికి ధీటుగా సమాధానిమిస్తున్నారు. భారతదేశ ఐకత్యను ఎవరూ దెబ్బతీయలేరంటూ సోషల్ మీడియా వేదికగా సమాధానమిస్తున్నారు. సినీ నటుడు అక్షయ్ కుమార్‌అజయ్ దేవగన్ తో పాటు టీమిండియా దిగ్గజం సచిన్ టెండుల్కర్ తో పాటు కేంద్ర మంత్రులు సినీ రాజకీయ ప్రముఖులు కేంద్రానికి మద్దతు తెలుపుతున్నారు. ట్విటర్ వేదికగా సాగిన ఈ వార్ పెను దుమారమే రేపుతోంది. బుధవారం రైతు అనుకూల ప్రభుత్వ అనుకూల పోస్టులు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్గా మారాయి. మరోవైపు సాగుచట్టాలపై రైతుల ఆందోళనకు అంతర్జాతీయ మద్దతుపై కేంద్రం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆన్ లైన్ లో బ్రిటన్ పార్లమెంట్ కు లక్షకుపైగా సంతకాలు పంపడం పట్ల తీవ్ర ఆగ్రహంతో ఉంది. సంతకాలు చేసిన వారిలో పలువురు భారత సంతతి సభ్యులు కూడా ఉన్నారు. కాగా రైతు దీక్షలకు మద్దతుగా పర్యావరణ ఉద్యమకారిణి గ్రేటా థన్బెర్గ్ అమెరికా ఉపాక్ష్యరాలు కమలా హ్యారిస్ మేనకోడలు మీనా మాజీ పోర్నార్ మియా ఖలిఫా వంటి వారు ట్వీట్ చేసిన విషయం తెలిసిందే.

కరోనాకు మరో వాక్సిన్

థాప్సిగార్గిన్ వ్యాక్సిన్ కనిపెట్టిన బ్రిటన్ శాస్త్రవేత్తలు
త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడి

నాటింగ్ హామ్,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారిని నిలువరించే వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చిన వేళ మరో శుభవార్తను బ్రిటన్ కు చెందిన నాటింగ్ హామ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు వెల్లడించారు. కరోనా చికిత్సకు ఇప్పుడు వినియోగిస్తున్న ఔషధాలతో పోలిస్తే ఎన్నో వందల రెట్లు ప్రభావవంతంగా పనిచేసే యాంటీ వైరల్ ను త్వరలోనే అందుబాటులోకి తేనున్నామని తెలిపారు. ఇది కరోనాతో పాటు దానికి సంబంధించిన మరిన్ని వైరస్ లపైనా పోరాడుతుందని స్పష్టం చేశారు. నాటింగ్ హామ్ శాస్త్రవేత్తల పరిశోధనల ఫలితాలు 'వైరసెస్' అనే జర్నల్ ప్రచురించింది. కరోనా ఔషధాలపై ప్రయోగాలు చేస్తున్న శాస్త్రవేత్తలు వృక్ష సంబంధ పదార్థాల నుంచి తయారు చేసిన థాప్సిగార్గిన్ అనే వైరస్ ఔషధాన్ని నియమిత మోతాదులో ఇస్తే అది కరోనా ను శరీరంలో నాశనం చేస్తోందని కనుగొన్నారు. ఇది కరోనా పైనే కాకుండా శ్వాస ద్వారా శరీరంలోకి ప్రవేశించే మరో రెండు వైరస్ లపైనా పని చేస్తోందని దీన్ని త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఇక దీన్ని వ్యాధి సోకక ముందు సోకిన తరువాత కూడా వినియోగించవచ్చని వేరువేరుగా గుర్తించడం సాధ్యం కాని వివిధ రకాల వైరస్ లు శరీరంలోకి ప్రవేశించిన వేళ థాప్సిగార్గిన్ చక్కగా పని చేస్తోందని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఈ వైరస్ లు శరీరంలో వృద్ధి చెందకుండా ఔషధం పని చేస్తుందని కనీసం 48 గంటల పాటు రక్షణ కల్పిస్తుందని పేర్కొన్నారు. దీన్ని నోటి ద్వారా తీసుకునే మాత్రగా తీసుకుని వస్తున్నామని ఇంజక్షన్లు లేదా ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం ఇక రాబోదని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ప్రస్తుతం తొలిదశలోనే వ్యాక్సిన్ ప్రయోగాలు ఉన్నాయని త్వరలోనే దీనిని అందుబాటులోకి తీసుకొస్తామని వ్యాక్సిన్ విజయవంతమైతే కరోనా లాంటి అన్ని రకాల వైరస్ లకు చెక్ పెట్టొచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

ఎమ్మెల్యే రమేష్ జర్మన్ పౌరుడే

-కేంద్రహోంశాఖ తెలంగాణ హైకోర్టులో అఫిడవిట్ దాఖలు

హైదరాబాద్,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ పౌరసత్వంపై హైకోర్టులో మరోసారి విచారణ జరిగింది. రమేష్‌కు జర్మనీ పౌరసత్వం ఉందని కేంద్ర హోంశాఖ అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ సందర్భంగా రమేష్ పౌరసత్వంపై వాదనలు జరిగాయి. రోస్టర్ మారడంతో సంబంధిత బెంచ్ విచారణ జరుపుతుందని జస్టిస్ చల్లా కోదండరాం తెలిపారు. జర్మనీ పౌరసత్వం ఉన్న వ్యక్తి పదేళ్లు చట్టసభల్లో ఉండటాన్ని తీవ్రమైన అంశంగా పరిగణించాలని కోర్టును పిటిషనర్ ఆది శ్రీనివాస్ న్యాయవాది రవికిరణ్ కోరారు. వీలైనంత త్వరగా కేసును సంబంధిత బెంచ్ ముందుంచాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. అనంతరం కేసును వాయిదా వేసింది. రమేష్ జర్మన్ పౌరుడేనని కేంద్రం దృవీకరించిన నేపథ్యంలో వేములవాడలో రాజకీయాలు వేడెక్కాయి.

తుదిదశకు పంచాయితీ పోరు

-ఎన్నికల గుర్తుఉల ప్రకటించడంతో ప్రచారంలో అభ్యర్థులు

గుంటూరు,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): పంచాయతీ పోరు తుది దశకు చేరడంతో ప్రచారం జోరందుకుంది. బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా, వారి గుర్తులను ఎన్నికల అధికారులు ప్రకటించడంతో అభ్యర్థులు తమ గుర్తులను ఓటర్లకు చేరేలా ప్రచురణ పత్రాలు, ఫ్లెక్సీలు సిద్ధం చేసుకుంటున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ప్రచారానికి తక్కువ సమయం ఉండటంతో వీలైనంత ఎక్కువ మంది ఓటర్లను ప్రత్యక్షంగా కలసి అభ్యర్థించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఈ ఎన్నికల్లో వాట్సప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాలో ప్రచారం కూడా బాగా పెరిగింది.నామినేషన్ల ఉపసంహరణ తర్వాత బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను తెలుగు అక్షరమాల క్రమంలో రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల గుర్తును వరుస క్రమంలో ప్రకటించారు. వాటిని అక్షర క్రమంలో మొదటి వ్యక్తికి మొదటి గుర్తు, రెండో వ్యక్తికి రెండో గుర్తు ... ఇలా ఎంతమంది పోటీలో ఉంటే అన్ని గుర్తులను కేటాయించారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు పలు పంచాయతీల్లో ఏకగ్రీవాలకే ఓటు వేశారు.

రికార్డు స్థాయిలో 67 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. తొలి దశలో తెనాలి డివిజన్‌లో 337 పంచాయతీలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా 20 శాతం పంచాయతీలు పోటీ లేకుండా అభ్యర్థుల గెలుపొందారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు నజరానా పెంచడం, పార్టీలకు అతీతంగా ఏకగ్రీవాలను వైఎస్సార్ సీపీ ప్రోత్సహించడంతో ఈ దఫా ఏకగ్రీవాలు భారీస్థాయిలో జరిగాయి. 2013లో జిల్లాలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 15 శాతమే ఏకగ్రీవాలు జరిగాయి. టీడీపీ ఉనికిని కాపాడుకోవడం కోసం పచ్చని పల్లెల్లో చిచ్చురేపుతోందని వైకాపా నేతలు మండిపడుతున్నారు.

మొదటి విడత ఎన్నికలు జరుగుతున్న తెనాలి డివిజన్‌లో నియోజకవర్గాల వారీగా రేపల్లెలో 17, ప్రత్తిపాడులో ఆరు, వేమూరులో 12, బాపట్లలో 15, పొన్నూరులో 10, తెనాలిలో ఏడు పంచాయతీల చొప్పున ఏకగ్రీవమయ్యాయి. 17 మేజర్ పంచాయతీలు ఏకగ్రీవం వైపు పయనించడం అభినందనీయమని అన్నారు. గురువారం నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసిన తర్వాత 270 పంచాయతీల్లో ఈ నెల 9న పోలింగ్ జరగనుంది.అయితే ఏకగ్రీవాలపై అధికారిక ప్రకటన చేయకుండా ఇసి నిషేధించింది. ఈ మేరకు కలెక్టర్ నుంచి నివేదికలను కోరింది.

ప్రపంచ దేశాలతో సంబంధాల పునరుద్ధరణ

ఆసక్తితో అడుగులు వేస్తోన్న అగ్రరాజ్యాధిపతి
విదేశాంగ విధానంపై స్పష్టమైన విధానంతో జో బైడెన్

వాషింగ్టన్,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): ప్రపంచ దేశాలతో దెబ్బతిన్న సంబంధాలను తిరిగి పునరుద్ధరిస్తామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. తమ దేశాన్ని, తమ విదేశాంగ విధానాన్ని తిరిగి గాడిన పెడతామని స్పష్టం చేశారు. అమెరికాను ఢీకొట్టాలన్న చైనా ఆశలను, అగ్రరాజ్య ప్రజాస్వామ్యాన్ని కూలదోయాలనుకుంటున్న రష్యా ఆశయాలను సమర్థంగా ఎదుర్కోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అదే సమయంలో మిత్రదేశాలతో ఏర్పడ్డ పొరపొచ్చాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుంటామన్నారు. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత బైడెన్ తొలిసారి తన విదేశాంగ విధానం ఎలా ఉండబోతోందో సమగ్రంగా వివరించారు. గురువారం విదేశాంగ శాఖ అధికారులతో సమావేశమైన ఆయన.. తన లక్ష్యాలను వారి ముందుంచారు. యావత్తు ప్రపంచం ఎదుర్కొంటున్న అణ్వాయుధ ముప్పు, వాతావరణ మార్పులు, కరోనా మహమ్మారి వంటి ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవ డానికి అన్ని దేశాలతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు బైడెన్. అమెరికా ఒంటరిగా వీటిని పరిష్కరించుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. దీనికోసం అమెరికా ప్రజాస్వామ్య విలువల్లో పాతుకుపోయిన దౌత్యవిధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. స్వేచ్ఛా-స్వాతంత్యాలను పరిరక్షించడం, అవకాశాల్ని అందిపుచ్చుకోవడం, సార్వత్రిక హక్కులను కాపాడడం, చట్టబద్ధమైన పాలనను సమర్థించడం, ప్రతి పౌరుడి ఆత్మగౌరవాన్ని గుర్తించడం వంటి విలువలే అమెరికాను ప్రపంచ శక్తిగా మార్చాయన్నారు. అవే అగ్రరాజ్యానికి బలాన్ని, ప్రయోజనాన్ని చేకూర్చాయని స్పష్టం చేశారు.

గత రెండు వారాల్లో అనేక మిత్రదేశాల అధినేతలతో మాట్లాడినట్లు బైడెన్ తెలిపారు. గత కొన్నేళ్లలో చెడిన సంబంధాల పునరుద్ధరణపై చర్చించినట్లు వెల్లడించారు. యెమెన్‌లో జరుగుతున్న యుద్ధానికి అమెరికా మద్దతను ఉపసంహరించుకుంటున్నామని బైడెన్ ఈ సందర్భంగా ప్రకటించారు. అలాగే సౌదీ అరేబియాపై జరుగుతున్న క్షిపణి, డ్రోన్ దాడుల్ని ఖండిస్తున్నామని తెలిపారు. వీటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు సౌదీ అరేబియాకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్లను అమెరికా నేరుగా ఎదుర్కొంటుందని బైడెన్ స్పష్టం చేశారు. ఆర్థికపరమైన ఇబ్బందులు, మానవ హక్కుల ఉల్లంఘన, మేధోహక్కుల తస్కరణ, ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి.. ఇలా చైనా నుంచి ఎదురవుతున్న ప్రతి సవాల్‌ను సమర్థంగా తిప్పికొడతామని తెలిపారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అమెరికా మిత్ర దేశాలైన భారత్, తైవాన్, సింగపూర్, ఫిలిప్పీన్స్, ఇండోనేసియా, దక్షిణ కొరియా, జపాన్ పట్ల చైనా ప్రదర్శిస్తున్న దుందుడుకు వైఖరిని విస్మరించబోమని తేల్చి చెప్పారు. అదే సమయంలో అమెరికాకు ప్రయోజనం చేకూరుతుందను కుంటే చైనాతో కలిసి పనిచేయడానికి కూడా వెనుకాడబోమని తెలిపారు. రష్యా విషయంలో మునుపటి అధ్యక్షుడు ట్రంప్ అవలంబించిన మెతక వైఖరికి స్వస్తి పలుకుతున్నట్లు బైడెన్ తెలిపారు. రష్యా దూకుడును ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. అమెరికా ఎన్నికల్లో జోక్యం, ప్రత్యర్థులపై విష ప్రయోగం, సైబర్ దాడులకు ఇక కాలం చెల్లిందని తెలిపారు. రష్యాకు గుణపాఠం చెప్పి అమెరికా ప్రయోజనాల్ని కాపాడుకోవడానికి ఏమాత్రం వెనుకాడబోమని తేల్చి చెప్పారు. రష్యా ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీని జైలుకు పంపడం, ఆయనకు మద్దతుగా చేస్తున్న నిరసనలను అణగదొక్కడం పట్ల ఈ సందర్భంగా బైడెన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

డెత్ టూరిజానికి పేరుగాంచిన వారణాసి

ముక్తి ధామంగా హిందువులకు పరమ పవిత్ర క్షేత్రం

వారణాసి,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): ప్రపంచంలో బహుశా వారణాసిని మాత్రమే 'డెత్ టూరిజం' అని పిలుస్తారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది తమవారి అస్థికలు తెచ్చి గంగలో నిమజ్జనం చేస్తుంటారు. పరిసర ప్రాంతాల్లోని వారైతే నేరుగా మృత దేహాలను వాహనాల్లో తీసుకుని వచ్చి అంత్య క్రియలను నిర్వహిస్తుంటారు. వన్నె తగ్గని వైభవందేవతల కోరికపై శివుడు ఈ కాశీ నగరాన్ని తన ఆవాసంగా చేసుకుని, స్వయంభువుగా, విశ్వేశ్వర జ్యోతిర్లింగంగా వెలిశాడని హిందువులు భావిస్తారు. సంస్కృతి పరంగా, కళల పరంగా, మత, విద్యా, వ్యాపారపరంగా ఉన్నతంగా ఉండేదీ నగరం. మధ్య యుగాలలో అనేకసార్లు దండయాత్రలకు, విధ్వంసానికి గురైన కాశీలో తర్వాత హిందూ రాజపుత్రులు, మరాఠా రాజులు అనేక ఆలయాలను పునర్నిర్మించారు. ప్రస్తుతం ఉన్న ప్రధాన ఆలయమైన విశ్వేశ్వర మందిరాన్ని 1780లో ఇండోర్ రాణి అహల్యాబాయి హోల్కర్ నిర్మించారు. ఎన్ని విధ్వంసాలు, ఎన్ని ఆటుపోట్లకు గురైనప్పటికీ వారణాసి తన వైభవాన్ని కోల్పోలేదు. కాశీ రాజుల ఆధ్వర్యంలో చాలాకాలం ఆలయ నిర్వహణ బాధ్యతలుండేవి. ఇప్పటికీ కాశీరాజుల వారసులకు ప్రత్యేక స్థానం ఉంది. ఆలయ నగరిగా ప్రసిద్ధి చెందిన కాశీలో చిన్నాపెద్దా ఆలయాలు 15,000 వరకు ఉంటాయని ప్రతీతి. గంగానది ఒడ్డున ఉన్న నగరాలన్నింటిలోనూ ప్రత్యేకమైనది కాశీ. ఉభయ సంధ్యల్లో ఈ జీవనది సౌందర్యం చూసి తీరాల్సిందే. సూర్యోదయ సమయంలో ఆకాశంలో కమ్ముకున్న అరుణవర్ణం గంగమ్మ ఒడిలో ప్రతిఫలించి సందర్శకులను సమ్మోహితులను చేస్తుంది. అపురూప దృశ్యాన్ని ఆస్వాదిస్తూనే నదిలో పవిత్ర స్నానాలు చేస్తుంటారు యాత్రికులు. మలిసంధ్యలో

నింగిలో పొంగుకొచ్చే కాషాయ తెరలు.. గంగ తరంగాలపై పొరలు పొరలుగా కదలిపోతూ ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. హిమాలయాల్లో పుట్టింది మొదలు దక్షిణాభిముఖంగా ప్రవహించే గంగా నది.. కాశీలో తన దిశ మార్చుకొని ఉత్తర దిశగా పయనమవుతుంది. అందుకే కాశీగంగలో మునకేస్తే పాపాలు తొలగిపోతాయని, మోక్షం సిద్ధిస్తుందని విశ్వసిస్తారు. ఇక ప్రతి సాయంత్రం గంగ ఒడ్డున పవిత్ర ఘాట్‌లలో నిర్వహించే హారతి మరో అద్భుతం. ముఖ్యంగా దశాశ్వమేధఘాట్, బాబూ రాజేంద్రప్రసాద్ ఘాట్‌లలో గంగా హారతి చూపురులను కట్టిపడేస్తుంది. కాశీగంగ పొడవునా దశాశ్వమేధ ఘాట్, తులసీఘాట్, హరిశ్చంద్ర ఘాట్.. ఇలా మొత్తం 84 ఘాట్లు ఉన్నాయి. వేటికవే ప్రత్యేకమైనవి. హరిశ్చంద్ర ఘాట్, మణికర్ణిక ఘాట్‌లలో నిరంతరాయంగా అంత్యక్రియలు జరుగుతూనే ఉంటాయి.

దశాశ్వమేధ ఘాట్, దర్భాంగా ఘాట్, హనుమాన్ ఘాట్, మన్ మందిర్ ఘాట్‌లలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం హారతులను నిర్వహిస్తారు. మానస సరోవర్ ఘాట్, నారదఘాట్, మణికర్ణిక ఘాట్‌లలో పిండ ప్రదానాలు, అస్థికల నిమజ్జనం వంటివి జరుగుతుంటాయి. గంగానదిలో బోట్‌లో, పడవలో ప్రయాణిస్తూ ఈ ఘాట్‌లను సందర్శించడం అద్భుతమైన అనుభూతిని కలిగిస్తుంది.అభిషేక యోగంవిశ్వనాథ ఆలయం ద్వాదశ జ్యోతిర్లింగాలలో తొమ్మిదోది. బంగారుపూత ఉన్న గోపురం ఉండడం వలన దానిని గోల్డెన్ టెంపుల్ అని పిలుస్తారు. ఆలయ గర్భగుడి చాలా చిన్నది. ఇక్కడ స్వామివారికి భక్తులు స్వయంగా అభిషేకాలు చేసుకోవచ్చు. గర్భాలయ గోడలపై సీతారామలక్ష్మణులు, దశభుజ వినాయకుడు, కాలభైరవుడు, శక్తి, యోగాసనంలో ఉన్న పార్వతీ పరమేశ్వరులు, లక్ష్మీ నారాయణులు ఉంటారు. ఆలయంలో అవిముక్తేశ్వర లింగం, పార్వతీ దేవి ఆలయం వంటి ఉపాలయాలున్నాయి. కాశీని సందర్శించే విదేశీయులు కొందరు నెలల తరబడి ఇక్కడే ఉండి ధ్యానం, యోగా, సంగీతం వంటివి సాధన చేస్తుంటారు.? ఇదొక మార్మిక నగరంగా భావిస్తారు. మార్మిక, తాంత్రిక విద్యలకు కేంద్రాలూ ఉంటాయి. అఘోరాలకు ఇది ఆవాసమని చెబుతారు. కాని సామాన్యంగా వారి దర్శనం ఎవరికీ లభించదు.? కాలభైరవ మందిర్, బిందు మాధవుడు, సంకట మోచన హనుమాన్ ఆలయం, రోజుకు తిలపరిమాణంలో పెరిగే తిలభాండేశ్వర సజీవ లింగం, కేదారఘాట్‌లోని కేదారేశ్వర మందిరం, అపమృత్యుదోషాలను తొలగించే మృత్యుంజయ మందిరం, తులసీదాసు రామాయణాన్ని రచించిన తులసీ మానస మందిరం, నీలకంఠేశ్వరుడు, ఓంకారేశ్వరుడు, డుండి గణపతి ఆలయం వంటి ప్రముఖ దర్శనీయ స్థలాలు ఇక్కడ ఉన్నాయి.? వరుణ, అసి అనే రెండు నదులు గంగానదితో సంగమించే మధ్య ప్రదేశమే వారణాసి. ఈ రెండు నదుల సంగమ స్థానం మధ్య ఉన్న ఐదు క్రోసుల దూరాన్ని భక్తులు పంచక్రోస యాత్రగా చేస్తారు. దేశం నలుమూలల నుంచి విమానం, రైలు, రోడ్డు మార్గాల ద్వారా వారణాసికి చేరుకోవచ్చు. ఈ నగరంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది. హైదరాబాద్ నుంచి వారణాసికి నాన్‌స్టాప్ విమాన సర్వీసులు ఉన్నాయి. హైదరాబాద్, విజయవాడ నుంచి రైళ్లు అందుబాటులో ఉన్నాయి. కాశీలో చలి, ఎండ కూడా ఎక్కువగానే ఉంటాయి. ఎండాకాలంలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత మాధ్చేస్తుంది. చలికాలం ఉష్ణోగ్రత 2, 3 డిగ్రీలకు వరకు పడిపోయి చలి వణికించేస్తుంది. అక్టోబరు నుంచి మార్చి మధ్య వారణాసి సందర్శించడానికి అనువైన సమయం.

విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణపై కార్మికుల ఆందోళన

పెట్టుబడుల ఉపసంహరణపై మండిపడ్డ కార్మికవర్గం
విశాఖలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలో పాల్గొన్న అఖిలపక్షనేతలు

విశాఖపట్నం,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పెట్టుబడుల ఉపసంహరణపై నిరసనలు వెల్లువెత్తాయి. శుక్రవారం.. జీవీఎంసీ ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. భారీ సంఖ్యలో స్టీల్ ప్లాంట్ కార్మికులు, ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్టీల్ ప్లాంట్ నుంచి గాజువాక ఎన్ఏడీ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు బైక్ ర్యాలీ సాగింది. నిరసనల్లో ఆల్ ట్రేడ్ యూనియన్లు పాల్గొన్నాయి. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా.. అఖిలపక్ష కార్మిక సంఘాల నేతృత్వంలో శుక్రవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద ఈ ర్యాలీ ప్రారంభమై, విశాఖపట్నంలో ఉన్న జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. ర్యాలీ అనంతరం నేతలు ధర్నా నిర్వహించారు. సుమారు వెయ్యి మందికి పైగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఈ పరిశ్రమలో 100 శాతం వాటాలను అమ్మేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తున్నామన్నారు. స్టీల్ ప్లాంట్‌తోపాటు ఇతర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలనే లక్ష్యంతో బిజెపి ప్రభుత్వం ముందుకు సాగడం దుర్మార్గమన్నారు. ఉక్కు ప్రయివేటీకరణకు బాధ్యత వహించి నగరంలోని బిజెపి నేతలు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రయివేటీకరించడాన్ని అడ్డుకొని తీరుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి, కార్మిక సంఘాల నేతలు, కార్మికులు, తదితరులు జాతీయ జెండాలను చేపట్టి ర్యాలీలో పాల్గొన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులకు వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, సత్యవతి మద్దతు పలికారు. విశాఖ ఉక్కును సాధించుకుంటామని స్టీల్ ప్లాంట్ కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ర్యాలీలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేస్తే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ర్యాలీలో అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు రామారావు, ఆదినారాయణరావు, వెంకట్రావు, అయోధ్యరావు, తదితరులు పాల్గొన్నారు. విశాఖ స్టీల్ ఎ÷-లాంట్‌ను ప్రైవేట్ పరం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని, స్టీల్ ప్లాంట్ కోసం ఎటువంటి త్యాగానికైనా సిద్ధమని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం 32 మంది ప్రాణత్యాగాలు చేశారని పేర్కొనారు. స్టీల్ ప్లాంట్‌లో రూ.4900 కోట్లు మాత్రమే పెట్టుబడి పెట్టారన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీ కరణనను లోక్‌సభలో అడ్డుకుంటామని ఆయన చెప్పారు. స్టీల్ ప్లాంట్ మెయిన్ గేటు వద్ద ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని ఎంవీవీ అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు లోక్‌సభలో పోరాడతామని ఎంపీ సత్యవతి అన్నారు. స్టీల్ ప్లాంట్‌ను పోరాటాలతో సాధించుకున్నామన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల బాటలో పయనించిందని, వేల కోట్లను కేంద్ర,రాష్ట్రాలకు పన్నుల రూపంలో ఆర్జించి పెట్టిందన్నారు.ప్రైడ్ ఆఫ్ ఏపీగా విశాఖ స్టీల్ ప్లాంట్ నిలిచిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయడాన్ని అడ్డుకుంటామని ఎంపీ సత్యవతి స్పష్టం చేశారు.

సాగుచట్టాలను వెంటనే రద్దు చేయాలి

-రైతు కుటుంబాన్ని పరామర్శించిన ప్రియాంక

న్యూఢిల్లీ,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం రైతులను ద్రోహులుగా ముద్రించడం ఆపేసి.. వెంటనే నూతన సాగు చట్టాలను రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ డిమాండ్ చేశారు. అన్నదాతలు జనవరి 26న నిర్వహించిన ట్రాక్టర్ ర్యాలీలో మృతి చెందిన రైతు కుటుంబాన్ని ఆమె యూపీలోని రాంపూర్ జిల్లాకు వెళ్లి పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'ర్యాలీలో ప్రాణాలు కోల్పోయిన రైతు మరణాన్ని వృథాగా పోనివ్వం. నూతన సాగు చట

స్త్రీ జననేంద్రియ వైకల్య ఆచారం అనాగరికం...!

(06 ఫిబ్రవరి 'అంతర్జాతీయ స్త్రీ జననేంద్రియ అవయవ వైకల్య వ్యతిరేక దినం' సందర్భంగా)

స్త్రీల జననేంద్రియ అవయవాలను, ముఖ్యంగా స్త్రీ జననేంద్రియ ప్రదేశంలోని క్లిటారిస్(స్త్రీగుహ్యాంకురం)ను మత విశ్వాసాల మాటున బలవంతంగా తీసి వేయడమనే దురాచారం నేటికీ ఆచరణలో ఉండడం అత్యంత విచారకరం. ఈ దురాచారాన్ని ఫీమేల్ జెనిటల్ మ్యుటిలేషన్,యఫ్‌జియం లేదా స్త్రీ సున్తీ' అని పిలుస్తారు. స్త్రీ జననేంద్రియ ప్రదేశంలో ఉండే చిన్న అవయవాన్ని స్త్రీగుహ్యాంకురము (క్లిటోరిస్) ఉంటారు. ముస్లిమ్ మతంలోని బొహ్రా వర్గంలోని 6 - 7 ఏండ్ల బాలికల మర్మాంగం వద్ద ఉన్న క్లిటారిస్‌ను పాక్షికంగా లేదా పూర్తిగా తొలగించడం లేదా గాయపరచడం అనబడే క్రూరమైన సామాజిక ఆచారం నేటికీ పాటించుట జరుగుతున్నది. ఈ ఆచారంతో స్త్రీలలో లైంగిక వాంఛలను తగ్గించడమనే ఉద్దేశ్యంతో జరుగుతున్నది. ఆరు, ఏడేండ్ల బాలికల క్లిటారిస్ కట్టింగ్ చేయడమనే దురాచారానికి వ్యతిరేకంగా ప్రతియేటా 06 ఫిబ్రవరిన 'అంతర్జాతీయ స్త్రీ జననేంద్రియ అవయవ వైకల్య లేదా కట్టింగ్ వ్యతిరేక దినం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ జీరో టాలరెన్స్ ఫర్ ఫీమేల్ జెనిటల్ మ్యుటిలేషన్)' పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. బాలికల ఈ లింగ వివక్ష ఆచారం భారత్‌లో అధికంగా కనిపిస్తున్నది. ముస్లిమ్ మతాచారం ప్రకారం పురుషులు కూడా పురుష జననేంద్రియ అవయవ వైకల్యం లేదా పురుష సున్తీ అనబడే విధానంలో పురుషాంగం చివరన ఉన్న చర్మాన్ని బలవంతంగా తొలగించడం జరుగుతుంది. దీనితో కూడా వ్యక్తుల్లో కొన్ని దుష్ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది.

ప్రపంచవ్యాప్తంగా 30కి పైగా దేశాల్లో 200 మిలియన్ల బాలికల క్లిటారిస్ తీసి వేయడం(యఫ్‌జియం) అనబడే దురాచారంతో బాలికలు/మహిళలు పలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలియజేస్తున్నది. స్త్రీ జననాంగ కట్టింగ్ లేదా యఫ్‌యంజీ అనబడే ఆచారం మానవ హక్కుల ఉల్లంఘన కిందికి వస్తుందని, దీనితో బాలికల/మహిళల పట్ల వివక్షతో చిన్నచూపు చూసినట్ల అవుతుందని తెలుసుకోవాలి. ఆఫ్రికా, అరబ్, ఆసియా, పశ్చిమ యూరప్, లాటిన్ అమెరికా దేశాల్లో పాటించే యఫ్‌జియం ఆచారాన్ని 'ఖఫ్ లేదా ఖఫ్జ్' అనే పేరుతో పిలుస్తారు. ఇలాంటి అనాగరిక పురాతన సాంప్రదాయంతో బాలికలు మానసిక వ్యధను, ఆనారోగ్యాన్ని అనుభవించడమే కాకుండా కొన్ని సందర్భాలలో మరణాలు కూడా సంభవిస్తున్నాయి. భారత్‌లోని బొహ్రా ముస్లిమ్ సమాజంలో 75 శాతం బాలికలు/మహిళలకు యఫ్‌యంజీ జరిగిందని అంచనా వేశారు. సూడాన్, ఈజిప్ట్, నైజీరియా లాంటి దేశాల్లో కూడా ఈ మూఢాచారం ఎక్కువగా కనిపిస్తోంది. సూడాన్‌లోని 15 - 49 ఏండ్ల మహిళల్లో 87 శాతం యఫ్‌జీయం దురాచారానికి లోనైనారని తెలుస్తోంది. క్లిటారిస్‌ను తొలగించడంతో పాటు యోని మార్గాన్ని ఇరుకు చేసే విధానం కూడా మతం ముసుగులో చేయడం జరుగుతోంది.

మతాచార నెపంతో అభాగ్య బాలికల్లో తీవ్ర నొప్పి, అతి రక్తస్రావం, జ్వరం, భయం, జననేంద్రియ కణజాల వాపు, టెటనస్ లాంటి అంటువ్యాధులు, పుండ్లు ఏర్పడడం, షాక్‌లు మాత్రమే కాకుండా మరణం కూడా సంభవించవచ్చు. యఫ్‌జీయంతో దీర్ఘకాలికంగా యోని సమస్యలు, రుతుస్రావ ఇబ్బందులు, లైంగిక సమస్యలు, మానసిక సమస్యలు, ప్రసవ సమయంలో అధిక శిశు మరణాలు మరియు మూత్రపిండ సమస్యలు కూడా ఎదురవుతాయి. నేటి ఆధునిక సమాజంలో మత విశ్వాలు ముదిరి రుతుస్రావ మహిళను 'అపరిశుభ్ర' శరీరంగా కూడా భావించడం అమానవీయం మరియు ఆక్షేపణీయం. 6 - 7 ఏండ్ల బాలికలను బాధించే యఫ్‌జియం ఆచారాన్ని నిషేధించాలనే, అది మానవ హక్కుల ఉల్లంఘన కిందికి వస్తుందని, పోక్సో చట్టం పరిధిలోకి వస్తుందని ప్రజా ప్రయోజన వ్యాజ్యం కూడా సుప్రీమ్ కోర్టుకు చేరింది. ఇలాంటి అనాగరిక, మొరటు, క్రూరమైన బాలికల ఆరోగ్య సమస్యను సత్వరమే నిషేధించాలని శాస్త్రీయ దృక్పథం కలిగిన విద్యావంతులు మరియు పౌర సమాజం కోరుకుంటున్నది. ఇలాంటి భయానక నేరపూరిత సాంప్రదాయం చిన్నారులను భయకంపితం చేయడమే కాకుండా ఎదిగిన కొద్ది అనారోగ్య కారణాలకు దారి తీస్తుందని వైద్యులు సూచిస్తున్నారు.

సాంప్రదాయవాదులు, మూఢ విశ్వాసాలను గుడ్డిగా నమ్మే సమాజాలలో ఈ దురాచారాన్ని నిషేధించుట కొంత కష్టమే. కాని సుదీర్ఘ అవగాహనతో స్త్రీ జననేంద్రియ కట్టింగ్ బాధల నుండి బాలికలను రక్షించే ప్రయత్నాలలో భాగంగా తల్లితండ్రులును చైతన్యవంతులుగా చేయవచ్చు. యఫ్‌జియం నిషేధ చట్టం చేయడం, దానిని గట్టిగా అమలు పరచడం జరగాలి. ప్రభుత్వాల నిరంకుశ సాంప్రదాయాలు యఫ్‌జియంని అమలు చేసే ప్రయత్నాలు చేస్తాయి. ఇలాంటి ఛాందస భావాలు ఉన్న దేశాల్లో నిషేధించడం వీలు కాకపోయినా, సభ్యసమాజం పెద్ద సవాళుగానే తీసుకొని తగ్గించే కృషి నిరాటంకంగా చేయాల్సి ఉంటుంది. యఫ్‌జియం పట్ల శూన్య సహనంతో నిషేధించడానికి మరియు ఈ దురాచారం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి 2018లో ప్రజ్ఞేష్ సింగ్ దర్శకనిర్మాతగా 40 నిమిషాల నిడివిగల లఘు చిత్రం 'షినాక్ఫ్' కూడా తీయడం జరిగింది. మహిళల ఆరోగ్యం, భద్రత, శరీరక సమగ్రత, హింస నుండి స్వేచ్ఛ, అమానవీయ పద్ధతి, స్వేచ్ఛ హక్కును హరించడం, మైనర్ బాలికలను ఇలాంటి శిక్షల నుండి రక్షించడం, లింగ సమానత్వం, మహిళా విద్య, ఆర్థిక స్వేచ్ఛ, యఫ్‌జియం దుష్పరిణామాల అనగాహన, సమ న్యాయం లాంటి చర్యలను ఐరాస మరియు ప్రభుత్వాలు సత్వరమే తీసుకొని యఫ్‌జియం దురాచారాన్ని నిర్మూలించే ప్రయత్నాలు గట్టిగా చేయాలి. స్త్రీ సున్తీ లేని సమాజాన్ని స్థాపించడంలో శూన్య సహనాన్ని ప్రదర్శిద్దాం. బాలికలను స్వేచ్ఛగా ఎదగనిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

తిరుచానూరులో 19న రథసప్తమి వేడుకలు

పద్మావతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

తిరుమల,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): ఈ నెల 19న సూర్యభగవానుడి జయంతి సందర్భంగా పద్మావతి అమ్మవారి ఆలయంలో రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు ఏడు వాహనాలపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించనున్నారు. అలాగే ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగనున్నాయి. రథసప్తమి సందర్భంగా ఉదయం 7.30గంటల నుంచి 8.30 గంటల వరకు సూర్యప్రభ వాహనం, 9-10 గంటల మధ్య హంస వాహనం, 10.30-11.30 వరకు అశ్వవాహనం, మధ్యాహ్నం 12.00 నుంచి 1.00 వరకు గరుడ వాహనం, 1.30 నుంచి 2.30 మధ్య చిన్నశేష వాహనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 7 వరకు చంద్రప్రభ వాహనం, రాత్రి 8.30 నుంచి 9.30 వరకు గజ వాహనంపై అమ్మవారు భక్తులకు దర్శన మివ్వనున్నారు. కాగా, సాయంత్రం 3.30గంటల నుంచి 4.30గంటల వరకు పద్మావతి అమ్మవారి ఆలయంలో శ్రీకృష్ణస్వామి ముఖమం డపంలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత కల్యాణోత్సవం, లక్ష్మీపూజ, ఊంజలసేవ, బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. తిరుచానూరులోని సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో ఉదయం 6 నుంచి 7గంటల వరకు స్వామి వారు అశ్వవాహనంపై భక్తులకు దర్శన మివ్వనున్నారు. ఇదిలా ఉండగా.. రథసప్తమి సందర్భంగా ఈ నెల 16న ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చాన, శుద్ధి నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రమిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు.

03 & 04 ఫిబ్రవరి 21 తేదీల్లో గ్లోబల్ చీఫ్స్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ సదస్సు నిర్వహించిన ఐఏఎఫ్

హైదరాబాద్, ఫిబ్రవరి 5:03 & 04 ఫిబ్రవరి 21 తేదీల్లో భారత వైమానిక దళం రెండు రోజుల గ్లోబల్ చీఫ్స్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ కాన్క్లేవ్‌కు ఆతిథ్యం ఇచ్చింది. ఏరో ఇండియా-21లో 2 మరియు 3 వ రోజున 'భద్రత మరియు స్థిరత్వం కోసం వైమానికి శక్తిని పెంచడం' అనే అంశంపై ఈ సమావేశాన్ని 03 ఫిబ్రవరి 21న గౌరవ రక్షణ మంత్రి ప్రారంభించారు. రక్షణ మంత్రి తన ప్రారంభ ప్రసంగంలో సీఎఎస్ కాన్క్లేవ్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైమానిక దళాలకు చెందిన ముఖ్యులను మరియు సీనియర్ ప్రముఖులను ఒకచోట చేర్చిందని చెప్పారు. ఏరో ఇండియాలో భాగంగా వైమానిక శక్తి మరియు అనుబంధ సాంకేతికతలు ఒకేచోటు చేరాయన్నారు. ప్రారంభ సెషన్‌లో డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ పాల్గొన్నారు.

అతిథులను స్వాగతిస్తూ, చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్, ఎయిర్ చీఫ్ మార్షల్ ఆర్కెఎస్ భదౌరియా ఆలోచనలను పంచుకునేందుకు మరియు వైమానిక దళాల మధ్య బహుపాక్షిక సహకారాన్ని పెంపొందించడంలో సీఎఎస్ కాన్క్లేవ్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం మరియు భద్రతను నిర్ధారించడానికి కీలకమైన సహాయకుడిగా వైమానికి శక్తి పాత్రను ఆయన పునరుద్ఘాటించారు.

కోవిడ్ -19 మహమ్మారి కారణంగా విధించిన ఆంక్షల కారణంగా ఈ సదస్సు హైబ్రిడ్ విధానంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి 50 దేశాలు హాజరయ్యాయి. ఫిబ్రవరి 03 ఉ 04 తేదీల్లో 28 దేశాల వైమానిక దళాల చీఫ్‌లు / కమాండర్లు కాన్క్లేవ్‌లో పాల్గొన్నారు. ఏరోస్పేస్ రంగంలో సమకాలీన ఆంశాలు, ఇతివృత్తాలపై ఆయా దేశాల ప్రతినిధులు ఆలోచనలు పంచుకోవడంతో పాటు ఉత్తమ విధానాల అమలు కోసం కాన్క్లేవ్ రూపొందించబడింది. సదస్సులో అమెరికా, యూరప్, మిడిల్ ఈస్ట్, పశ్చిమ ఆసియా, మధ్య ఆసియా రిపబ్లిక్, సౌత్ ఈస్ట్ ఆసియా, ఆఫ్రికా, హిందూ మహాసముద్ర ప్రాంతం మరియు ఇండో పసిఫిక్ దేశాలు, ఖండాల నుండి వైమానిక దళాలు పాల్గొన్నాయి.

సిఏఎస్ కాన్క్లేవ్ యొక్క మూడు సెషన్లు ఏరోస్పేస్ వ్యూహానికి సంబంధించి ముఖ్యమైన సమస్యలను చర్చించడానికి ఒక ఫోరమ్ను అందించాయి. యుద్ధ క్షేత్రాన్ని ప్రభావితం చేసే అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు మరియు గ్లోబల్ కామన్స్ యొక్క భద్రత మరియు స్థిరత్వానికి సంబంధించిన సమస్యలు చర్చకు వచ్చాయి. ఈ సదస్సులు "డిస్ట్రప్టివ్ టెక్నాలజీస్ అండ్ ఇన్నోవేషన్స్", "ఇండో-పసిఫిక్ రీజియన్‌లో వైమానికి శక్తి " మరియు "ఎయిర్ పవర్ అండ్ ఏరోస్పేస్ స్ట్రాటజీ" యొక్క ఇతివృత్తాలను పరిష్కరించడానికి ప్రణాళిక చేయబడ్డాయి.

ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు, నామినేటెడ్ దేశ ప్రతినిధులు మరియు సభ్యులకు కాన్క్లేవ్ సందర్భంగా వారు చేసిన విలువైన కృషికి సిఎస్ఎస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కాన్క్లేవ్ వాయుసేనల మధ్య అవగాహన మరియు సహకారాన్ని పెంచుతుంది. అలాగే మెరుగైన బహుపాక్షిక సామర్థ్యాలను ఏర్పరచటానికి సహాయపడుతుంది అని చెప్పారు.

భార్యను హత్యచేసి మిస్సింగ్ కేసు నమోదు

భర్త దారుణాన్ని గుర్తించిన పోలీసులు

ఖమ్మం,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): జిల్లాలోని పెనుబల్లి మండలం కొత్త లంకపల్లిలో దారుణం చోటుచేసుకుంది. వివాహిత దారుణ హత్యకు గురైంది.. భర్తే.. భార్యను దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. మృతురాలు ఎర్రమల్ల నవ్యరెడ్డి (22)గా పోలీసులు గుర్తించారు.

రెండు రోజుల క్రితం ఏర్రుపాలెం పోలీస్‌స్టేషన్‌లో నవ్యరెడ్డి కనబడటం లేదని మిస్సింగ్ కేసు నమోదయింది. అయితే ఇందులో ట్విస్ట్ ఏంటంటే మిస్సింగ్ కేసు పెట్టింది కూడ భర్తే.

మిస్సింగ్‌లో భాగంగా పోలీసులు విచారణ చేస్తుండగా.. శుక్రవారం కుక్కల గుట్ట సమీపంలో నవ్యరెడ్డి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. దీంతో అనుమానించిన పోలీసులు భర్త నాగశేషురెడ్డి పోలీసులు అదుపులో ఉన్నారు. నవ్యరెడ్డిని భర్త బైక్ పై తీసుకువెళ్తున్న సీసీటివి ఫుటేజ్‌ని పోలీసులు సేకరించారు. నిందితుడితో పోలీసులు సీన్ రీ కన్ స్టక్షన్ చేస్తున్నారు. రెండు నెలల క్రితం నాగశేషు రెడ్డితో నవ్యరెడ్డికి వివాహం జరిగింది. ఇద్దరిది మధిర మండలం ఏర్రుపాలెం గ్రామం. నవ్యరెడ్డి సత్తుపల్లిలో సాయి స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజిలో బిటెక్ రెండవ సంవత్సరం చదువుతు ఉండగా...నాగశేషురెడ్డి బెంగుళూర్‌లో ఉద్యోగం చేస్తున్నారు.

416వ రోజుకు అమరావతి రాజధాని రైతుల పోరు

గ్రామాల్‌లో ఆగని నిరసనలు.. ఆందోళనలు
ఢిల్లీలోని రైతుల ధర్నాకు రాజధాని రైతుల మద్దతు

అమరావతి,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ రైతులు, మహిళలు చేపట్టిన నిరసనలు 416వ రోజుకు చేరుకున్నాయి. మందడం, తుళ్లూరు, వెలగపూడి, వెంకటపాలెం, కృష్ణాయపాలెం, ఎర్రబాలెం, ఉద్దండరాయుని పాలెం, రాయపూడి, నీరుకొండ, అనంతవరం, పెదపరిమి, ఐనవోలు, నెక్కల్లు, దొండపాడు, బేతపూడి, ఉండవల్లి తదితర గ్రామాల్లోని శిబిరాల్లో రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. రాజధానిగా అమరావతి కొనసాగుతుందని ప్రభుత్వం చెప్పే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని రాజధాని రైతులు స్పష్టం చేశారు. కరోనా సూచనలు పాటిస్తూ అమరావతి ఉద్యమం సాగుతోంది. ఏడాదిపైగా సాగుతున్న అమరావతి రాజధాని రైతుల ఉద్యమ ధ్వనులు ఢిల్లీలో ప్రతిధ్వనిం చాయి. ఢిల్లీ సరిహద్దులో సాగుచట్టాల రద్దు డిమాండ్‌తో గత కొంతకాలంగా రైతులు చేస్తున్న ఆందోళనలో అమరావతి రైతులు, ఈ ప్రాంత ఉద్యమ మహిళలు, దళితులు స్వయంగా పాల్గొన్నారు. తమ ఉద్యమం తరఫున వారికి గట్టి మద్దతు ప్రకటించారు. అమరావతి రాజధాని మహిళా జేఏసీ, దళిత మహిళా జేఏసీ, యంగ్ ఫర్ యూత్ ప్రతినిధుల బృందం రాయపాటి శైలజ, వడ్డే అన్నపూర్ణ నాయకత్వంలో అమరావతి నుంచి బయలుదేరి వెళ్లి.. సింఘూ, టిక్రీ, ఘాజీపూర్ సరిహద్దుల్లోని రైతుల శిబిరాలను సందర్శించింది. 'జై అమరావతి.. సేవ్ అమరావతి...జై ఆంధ్రప్రదేశ్' అనే నినాదాలతో ఈ బృందం బ్యానర్లను ప్రదర్శించింది. రైతు ప్రయోజనాలను దెబ్బతీసే నల్ల చట్టాలను తక్షణమే రద్దు చేయాలనీ, రైతుల సంక్షేమం, వారి ఆర్థిక ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉన్నదనీ స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో వైకాపా ప్రభుత్వం ద్రోహం తలపెట్టిందని వారు వాపోయారు. అమరావతి రాజధానికోసం స్వచ్ఛందంగా రైతులు 34వేల ఎకరాలను ప్రభుత్వానికి సీఆర్‌డీఏ చట్టం ద్వారా ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతిని కాదని ఇపుడు మూడు రాజధానుల నినాదంతో రైతులను అనేక ఇబ్బందు లకు, వేధింపులకు గురిచేస్తోంది. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం కౌలు డబ్బు కూడా సక్రమంగా ఇవ్వడంలేదు. రాజధాని కోసం భూములిస్తే, ఇపుడు అక్కడ రాజధానిని తరలించాలని ఏకపక్ష నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఏకపక్ష, నియంతృత్వ నిర్ణయానికి నిరసనగా గత 416రోజుల నుంచి రైతులు అమరావతిలో శాంతియుత పోరాటం చేస్తున్నారు. ఉద్యమించే రైతులు, మహిళలపై లాఠీలను ప్రయోగిస్తున్నారు. తప్పుడు కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తున్నారు. మరోవైపు రైతు ఉద్యమానికి సంఘీభావంగా అమరావతి నుంచి ఢిల్లీ వెళ్లిన బృందం.. ఉద్యమ సారథి రాకేశ్ తికాయత్‌ను కలుసుకొంది. అభివృద్ధిని నిలిపేసి అమరావతి నుంచి రాజధానిని తరలించేందుకు ఏపీ ప్రభుత్వం సాగిస్తున్న దమన కాండను తికాయత్‌కు వివరించింది.

గుంటూరు,చిత్తూరు జిల్లాల్లో ఏకగ్రీవాలకు బ్రేక్

వెంటనే ఫలితాలు ప్రకటించ వద్దని నిమ్మగడ్డ ఆదేశాలు
ఫిర్యాదులను పరిష్కరించిన తర్వాతే ఫలితాలు ప్రకటిస్తామని వెల్లడి
ఇసి నిమ్మగడ్డ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే రోజా

అమరావతి.ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో ఏకగ్రీవాలను వెంటనే ప్రకటించవద్దంటూ కలెక్టర్లకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేవరకు ఫలితాలను హోల్డ్‌లో ఉంచాలని పేర్కొంది. తమకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించిన తర్వాతే ఫలితాలు ప్రకటించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అలాగే ఎన్నికలపై వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి నివేదిక పంపాలని చిత్తూరు, గుంటూరు కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చింది. లోపాలు ఉన్నట్లు తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఈసీ హెచ్చరించింది. గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో భారీగా ఏకగ్రీవాలు జరిగినట్లు ఎన్నికల కమిషన్ గుర్తించింది. మిగితా జిల్లాలకు విభిన్నంగా ఉండటంతో కమిషన్ ఈ వ్యవహారంపై ఆరా తీసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఎన్నికలకు సంసిద్ధత పట్ల ఎన్నికల సంతృప్తిని వ్యక్తం చేసింది. కలెక్టర్లు, ఎస్పీలు పూర్తి చర్యలు తీసుకుంటున్నారని అభినందించింది. పోలీసులు వ్యాక్సినేషన్ వేయించుకునే కార్యక్రమాన్ని పక్కనపెట్టి ఎన్నికల విధులు నిర్వహించడానికి ముందుకు రావడంపై ఎస్ఈసీ అభినందనలు తెలిపింది. ఇకపోతే చిత్తూరు జిల్లాలో జరిగినా పంచాయతీ ఎన్నికల ఏకగ్రీవాలకు ఎన్నికల కమిషన్ బ్రేక్ పడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. జిల్లాల్లో 454 పంచాయతీలకు గాను 110 ఏకగ్రీవాలు నమోదు కావడంతో తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఏకగ్రీవాలను ప్రకటించకూడదని కమిషన్ స్పష్టం చేయడంతో అధికార పార్టీ నేతలకు షాక్ తగిలినట్టు అయింది. అయితే ఎన్నికల ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏకగ్రీవాలు జరిగాయని వాటిని తప్పుపడటం ఎంటని వైకాపా నేతల ఆరోపణగా ఉంది.. తాజాగా ఈ అంశం మీద ఎమ్మెల్యే రోజా మాట్లాడుతూ .. నిమ్మగడ్డ ప్రవర్తన చూస్తే చిన్న మెదడు చితికిపోయినట్లు అనుమానం వస్తోందని అన్నారు. గతంలో జరిగినా వాటికి ఎలా పోల్చి చిత్తూరు, గుంటూరు ఎస్పీ,కలెక్టర్ మార్చి ఎన్నికల నిర్వహించారని, ఇప్పటికీ ఏకగ్రీవాలు అయితే పునః పరిశీలన చేయాని చెప్పడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. నిమ్మగడ్డకు ఆయనపైనే నమ్మకం లేకుండా పోయిందా.. అని రోజా ప్రశ్నించారు. నీకు నచ్చిన వారినే కదా తెచ్చి పెట్టుకున్నావు, చంద్రబాబు అండ్ కో డైరెక్షన్ లో నిమ్మగడ్డ ఎలా పనిచేస్తున్నాడని చెప్పడానికి ఇదోక ఉదాహరణ అని ఆమె అన్నారు. ప్రజలు చేసుకున్న ఏకగ్రీవాలను గౌరవించండి ...హాస్యాస్పదం చేయకండి అని ఆమె కోరారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎం ఎస్ బాబు మాట్లాడుతూ నిమ్మగడ్డకు ఎమైనా మతిమరుపు వచ్చిందా అని ప్రశ్నించారు. చంద్రబాబు చెప్పినట్లు కాకుండా మీరు ఆలోచించి నిర్ణయం తీసుకోండన్న ఆయన ప్రజలందరు గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చిని ఏకగ్రీవం చేసుకున్నారని అన్నారు.

పునరావృత్త ఇంధన క్షేత్రంలో కింగ్‌డమ్ ఆఫ్ బెహ్రైన్ సభ్యులతో కూడిన జాయింట్ వర్కింగ్ గ్రూప్ తొలి సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 : పునారవృత్త ఇంధన క్షేత్రంలో భారత్, కింగ్‌డమ్ ఆఫ్ బెహ్రైన్ సభ్యులతో కూడిన జాయింట్ వర్కింగ్ గ్రూప్ తొలి సమావేశం దృశ్య మాధ్యమం ద్వారా గురువారం జరిగింది. పునరావృత్త ఇంధన అథారిటీ అధ్యక్షుడు డాక్టర్ అబ్దుల్ హుస్సేన్ బిన్ ఆలీ మిర్జా, బ్రహైన్ బృందానికి నాయకత్వం వహించారు. భారత బృందానికి నూతన, పునారవృత్త ఇంధన మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి దినేష దయానంద జగ్దలే నాయకత్వం వహించారు. ఈ సమావేశంలో కింగ్డమ్ ఆఫ్ బహ్రైన్‌కు భారతీయ రాయబారి అయిన ఎస్ హెచ్. పీయూష్ శ్రీవాస్తవ కూడా పాల్గొన్నారు.

పునరావృత్త ఇంధన రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని ప్రోత్సహించేందుకు జులై, 2018లో భారత్, బహ్రైన్‌లు అవగాహనా పత్రంపై సంతకాలు చేశాయి.

వాతావరణ మార్పు లక్ష్యాలను సాధించడానికి పునరావృత్త ఇంధన ప్రాముఖ్యతను ఇరు వర్గాలూ నొక్కి చెపుతూ, తాము తీసుకున్న చొరవలను, సాధించిన ప్రగతిని, తమ తమ ప్రభుత్వాలు పెట్టుకున్న భవిష్యత్ లక్ష్యాలు, ఈ రంగంలో అందుబాటులో ఉన్న అవకాశాలను పట్టి చూపారు. ఈ సమావేశం ఎంతో ఉత్పాదకంగా ఉంది. తమ తమ అనుభవాలను, నైపుణ్యాలను, ఉత్తమ ఆచరణ పద్ధతులను పంచుకోవాలని అంగీకారానికి వచ్చారు. ముఖ్యంగా సౌర, పవన, పరిశుద్ధమైన ఉదజని రంగాలలోను, ప్రైవేటు రంగంలో సంబంధిత ఏజెన్సీల మధ్య స్పష్టమైన సహకారం , సామర్థ్య నిర్మాణంలో మరింత లోతైన భాగస్వామ్యాన్ని కలిగి ఉండాలని ఇరువర్గాలూ అంగీకరానికి వచ్చాయి.

సమావేశం సాదర, స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది. తదుపరి జాయింట్ వర్కింగ్ గ్రూప్ సమావేశాన్ని పరస్పరం ఆమోదయోగ్యమైన తేదీలలో నిర్వహించాలని అంగీకరించారు. ఈ తేదీలను దౌత్య మార్గాల ద్వారా నిర్ణయిస్తారు.

విధినిర్వహణలో చూపిన తెగువ అభినందనీయం

కాశీబుగ్గ ఎస్ఐ కొత్తూరు శిరీషకు రాములమ్మ అభినందన

హైదరాబాద్,ఫిబ్రవరి5(ఆర్ఎన్ఎ): ఏపీలోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కొత్తూరు శిరీష ఇటీవల ఓ అనాథ శవాన్ని తన భుజాలపై మోసుకుంటూ కిలో మీటర్ దూరం నడిచారు. ఓ స్వచ్ఛంద సంస్థతో కలిసి ఆమె అంతిమ సంస్కారాలు కూడా నిర్వహించారు. అయితే తాను 'కర్తవ్యం' సినిమాను ప్రేరణగా తీసుకుని తన కుమార్తెను ఎస్సైని చేశానని ఓ ఇంటర్వ్యూలో శిరీష తండ్రి చెప్పారు. దీనిపై తాజాగా ప్రస్తుత బీజేపీ నాయకురాలు, 'కర్తవ్యం' సినిమాలో హీరోయిన్‌గా నటించిన విజయశాంతి స్పందించారు. తను నటించిన సినిమా ఒక తండ్రికి ప్రేరణనివ్వడం పట్ల ఆమె ఫేస్‌బుక్ వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. 'నేను నటించిన కర్తవ్యం సినిమా ఒక తండ్రికి ప్రేరణనిచ్చి, తన కూతురిని సమాజం మెచ్చే పోలీస్ అధికారిణిగా తీర్చిదిద్దడం నాకెంతో ఆనందం కలిగిం చింది. ఎన్ని ప్రతికూలతలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొని విధి నిర్వహణలో ముందుకు సాగుతున్న కాశీబుగ్గ ఎస్ఐ కొత్తూరు శిరీషకు అభినందనలని విజయశాంతి తెలిపారు.

ఘనంగా అల్వార్ స్వామి వర్ధంతి వేడుకలు...

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 5: (నేటినిజం ప్రతినిధి):తెలంగాణ వైతాళికుడు వట్టికోట ఆళ్వారుస్వామి 60వ వర్ధంతి వేడుకలను చందుర్తి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వికృతి లక్ష్మీనారాయణ గౌడ్ ఆళ్వార్ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు,

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ " తెలంగాణ వైతాళికుడు తెలంగాణ ప్రజా సాహిత్యానికి పాదులు వేసి ప్రాణం పోసిన వాడు వట్టికోట ఆళ్వారుస్వామిఅని గుర్తు చేశారు, రచయిత ,సేవాశీలి ,ఉద్యమకర్త ,కమ్యూనిస్టు నేత, ప్రచురణకర్త, పాత్రికేయుడు ,ప్రచారకుడు ఆయన. భాష సాహిత్యాల దగ్గర్నుంచి పౌరహక్కుల దాకా వట్టికోట అన్ని ఉద్యమాల్లో పాలుపంచుకున్నాడన్నారు, 1915 నవంబర్ ఒకటవ తేదీన నల్లగొండ జిల్లా నకిరేకల్ సమీపంలోని మాచవరం లో సింహాద్రమ్మ, రామచంద్ర ఆచార్యులకు జన్మ